ఆరు వేలకుపైగా విద్యార్థుల వీసాల రద్దు

- అమెరికా విదేశాంగశాఖ వెల్లడి

7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 20 | విజయవాడ, బుధవారం 20 ఆగస్టు 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 20 August 2025 | Rs

శుభ్‌మన్‌కు చోటు

- శ్రేయస్, జైస్వాల్‌కు మొండిచేయి
- ఆసియా కప్ భారత జట్టు ఎంపిక

8

పేదల ఆరోగ్య పరిరక్షణకు సంజీవని

బిల్‌గేట్స్ ఫౌండేషన్ సహకారంతో త్వరలో కొత్త పథకం

బంగారు కుటుంబాలకు మార్గదర్శకుల చేయూత అవసరం • పి-4 అమలు సదస్సులో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలోని పేదల ఆరోగ్య పరిరక్షణకు సంజీవని పేరుతో కొత్త పథకం అమలు చేయనున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గుంటూరు జిల్లా మంగళగిరి సికె కన్వెన్షన్ హాలులో మంగళవారం జరిగిన పి-4 సదస్సులో ఆయన ప్రసంగించారు. పలువురు మార్గదర్శకులతోనూ, బంగారు కుటుంబాలకు చెందిన పేదలతోనూ ఆయన ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ పి-4 ద్వారా పేదలకు మేలు చేయాలన్న తన సంకల్పాన్ని ఆచరణలో చేసి చూపిస్తానన్నారు. ఈ నెలాఖారుకు 15 లక్షల బంగారు కుటుంబాలకు సాయం అందించేలా లక్షన్నర మంది మార్గదర్శకులను ఎంపిక చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 13,47,697 కుటుంబాలకు 1,41,977 మార్గదర్శకులను అనుసంధానం చేశామని తెలిపారు. పి-4 విజయవంతం అయిన వెంటనే త్వరలోనే ప్రజల ఆరోగ్య సమస్యలపై దృష్టి పెడతానన్నారు. బిలిగేట్స్ ఫౌండేషన్‌తో చర్చించి ప్రపంచంలో ఎన్ని రకాల నైపుణ్యం, నాలెడ్జిలతో అనుసంధానం చేసి ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే సంజీవనిని తెస్తానని ప్రకటించారు. పేద, మధ్య తరగతి కోసం ఇప్పటికే ఆరోగ్య శ్రీ, సిఎం సహాయ నిధి, కేంద్రం అమలు చేస్తోన్న పలు పథకాలతోపాటు ఇంకా మెరుగ్గా ఆరోగ్య పరిరక్షణకు త్వరలో అన్ని రకాల అంశాలతో కలిపి సంజీవని పథకం తీసుకురానున్నట్టు వివరించారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను కల్పించడమే తన జీవిత ఆశయమన్నారు. పేదలను ఆదుకునే మార్గదర్శకులు కేవలం ధన సాయం చేస్తే సరిపోదని, వారి జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు కూడా పరిష్కారం చూపాలని సూచించారు. రాష్ట్రంలో కోటీ 69 లక్షల కుటుంబాలు ఉన్నాయని, వీరిలో 21 లక్షల మంది పేదలను గుర్తించామని తెలిపారు. మార్గదర్శకులు ఇచ్చే చేయూతను బంగారు కుటుంబాల వారు అందిపుచ్చుకుని సమాజంలో ఎదగాలని కోరారు. పి-4 ఆచరణ సాధ్యం కాదని కొంతమంది ప్రచారం చేస్తున్నారని, కానీ తాను ఆచరణ సాధ్యమేనని నమ్ముతున్నానని తెలిపారు. సంపద సృష్టిస్తామని, తద్వారా ఆదాయం పెరగాలని అన్నారు. సంపద ఒకే చోట కేంద్రీకృతం కాకుండా పేద వారికి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో డొక్కా సీతమ్మ వంటి మహిళలు ఎన్నో ఏళ్ల క్రితమే బాటసారులకు ఉచితంగా భోజనం వండి వడ్డించారని గుర్తు చేశారు. తనకు సంపద లేకున్నా ఇతరులకు దానం చేసే గుణం తెలుగువారిలో ఎప్పటి నుంచో ఉందని వివరించారు. ప్రస్తుత బంగారు కుటుంబాలవారు భవిష్యత్తులో మార్గదర్శకులుగా మారతారని ఆశాభావం వ్యక్తం చేశారు. పేదల సంక్షేమం కోసం ఇప్పటికే అనేక పథకాలు అమలు చేస్తున్నామని, అయినా ఇంకా పేదరికం కొనసాగుతోందని తెలిపారు. సేవతో తృప్తి, సాయంతో సంతృప్తి ఉంటాయన్నారు. కుప్పం నియోజకవర్గానికి చెందిన 250 కుటుంబాలను చంద్రబాబు దత్తత తీసుకున్నారు. దీనికి చిహ్నంగా 'అడాప్ట ట్రీ' నమూనాను కుప్పంలోని బంగారు కుటుంబాల వారికి ఆయన ఈ వేదికపై అందజేశారు. పి-4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ సి.కుటుంబరావు, ఎన్ఆర్‌టి చైర్మన్ వేమూరి రవికుమార్, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో 250 కుటుంబాల దత్తతకు చిహ్నంగా ఎడాప్ట ట్రీ నమూనాను బంగారు కుటుంబాలకు అందిస్తున్న సిఎం

పత్తిపై దిగుమతి సుంకం తొలగింపు

- రైతు సంఘం ఖండన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పత్తి దిగుమతులపై 11 శాతం సుంకాన్ని, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి సెస్‌ను తక్షణమే రద్దు చేయాలని కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. పత్తిపై దిగుమతి సుంకం తొలగించడం దేశ వ్యాప్తంగా పత్తి రైతులకు మరణశాసనంతో సమానమని సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల దేశీయ మార్కెట్‌లో పత్తి ధర పతనం అవుతుందని, ఫలితంగా రైతులు మరిన్ని కష్టాలు, అప్పుల పాలవుతారని తెలిపారు. ప్రధాని మోడీ ద్వంద్వ వైఖరి రైతాంగానికి తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. 2025లో వ్యవసాయ ఖర్చుల కమిషన్ ఖరీఫ్ పంటల కోసం ఎంఎస్‌పి ప్రకారం పత్తి ధర క్వింటాకు రూ.7,710గా ఉందని, ఇది సి2+50శాతం రేటు ప్రకారం ఉండాల్సిన దానికన్నా రూ.2365 తక్కువగా ఉందని తెలిపారు. దేశంలో పత్తి పంట ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే రైతుల ఆత్మహత్యలు అధికంగా ఉన్నాయని తెలిపారు. మన దేశంలో పత్తి విస్తారంగా సాగు చేస్తున్న రాష్ట్రాల్లో మహారాష్ట్ర, కర్ణాటక, తరువాత మన రాష్ట్రం ఉందన్నారు. ఇప్పటికే పత్తి పండించిన రైతులు గిట్టుబాటు ధర లేక అప్పులు పాలు కావడం, ఆత్మహత్యలు చేసుకోవడం నిత్యం చూస్తున్నామని, దిగుమతి సుంకం ఎత్తివేస్తూ కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం పత్తి రైతాంగానికి తీవ్ర ప్రమాదాన్ని తెచ్చి పెడుతుందని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా గ్రామ స్థాయిలో తీర్మానాలు చేసి ప్రధాని నరేంద్ర మోడీకి పంపాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక నిర్ణయాన్ని ప్రతిఘటించాల్సిందిగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.

ఇండియా బ్లాక్ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్ష ఇండియా బ్లాక్ తరపున ఉప రాష్ట్రపతి రేసులో తెలుగు బిడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డి బరిలో నిలిచారు. ఇండియా బ్లాక్ నేతలతో మంగళవారం చర్చించిన తరువాత జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరును ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ప్రకటించారు. ఈ నెల 21న ఇండియా బ్లాక్ తరపున నామినేషన్ దాఖలు చేస్తారని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం రాజాజీ మార్గ్‌లోని ఖర్గే నివాసంలో ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై ఇండియా బ్లాక్ నేతలు శరద్ పవార్, సంజయ్ రౌత్, కెసి వేణుగోపాల్, జైరాం రమేష్, డెరెక్ ఓ'బ్రియన్, కనిమొళి, తిరుచ్చి శివ, జాన్ బ్రిట్టాస్, ధర్మేంద్ర యాదవ్ తదితరులు చర్చించారు. అనంతరం జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఏకగ్రీవంగా అంగీకరించారు. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా సహకరిస్తోందని నేతలు వెల్లడించారు.

సామాజిక న్యాయం కోసం పోరాడే యోధుడు... : ఖర్గే

ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే మాట్లాడుతూ దేశంలోని అత్యంత విశిష్టమైన, ప్రగతిశీల న్యాయనిపుణులలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఒకరని అన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న యోధుడని చెప్పారు. "ఉపరాష్ట్రపతి పోటీ ఒక సైద్ధాంతిక పోరాటం. రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువలను ఆయన పూర్తిగా ప్రతిబింబించారు. అందుకే ప్రతిపక్ష పార్టీలు సుదర్శన్‌రెడ్డిని తమ ఉమ్మడి అభ్యర్థిగా నామినేట్ చేశాయి" అని తెలిపారు.

వ్యవసాయ కుటుంబం నుంచి ఉప రాష్ట్రపతి బరిలోకి...

సామాజిక న్యాయంపై విస్తృతమైన అవగాహన కలిగిన వ్యక్తిగా మంచి పేరు సంపాదించుకున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తెలుగుబిడ్డ. ఆయన పూర్తి పేరు బాలకృష్ణ సుదర్శన్ రెడ్డి. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారంలో వ్యవసాయ కుటుంబంలో 1946 జూలై 8న జన్మించారు. 1971లో ఉస్మానియా యూనివర్శిటీ నుంచి న్యాయశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ పొందారు. అదే ఏడాది ఆనాటి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా చేరారు. 1988లో ప్రభుత్వ న్యాయవాదిగా, ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 1993 మే 2న న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005 డిసెంబర్ 5న గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2007 జనవరి 12న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన 2011 జూలై 7న పదవీ విరమణ చేశారు. తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే-2024 (ఎస్ఇఇపిసి) వర్కింగ్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించారు. 2013 మార్చిలో గోవాకు మొదటి లోకాయుక్తగా నియమితులైన ఆయన అదే ఏడాది అక్టోబర్‌లో వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేశారు. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఆర్బిటరేషన్ అండ్ మెడిటేషన్ సెంటర్ బోర్డులో ట్రస్టీగా ఉన్నారు.

ఎన్‌టిఆర్ స్ఫూర్తితో మద్దతివ్వండి

- తెలుగు రాష్ట్రాల్లోని పార్టీలకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

7

సిద్ధార్థ వరదరాజన్, కరణ్ థాపర్ పై అస్సాంలో దేశద్రోహం కేసు

- జర్నలిస్టు సంఘాల ఖండన

న్యూఢిల్లీ : ద వైర్ మీడియా సంస్థ ఎడిటర్ సిద్ధార్థ వరదరాజన్, సీనియర్ జర్నలిస్టు కరణ్ థాపర్‌పై అస్సాంలో రాజద్రోహం కేసు నమోదైంది. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 152 కింద ఆ జర్నలిస్టులపై దేశద్రోహం కేసు నమోదు చేశారు. "ఇండోనేషియాకు భారత రక్షణ అనుబంధ అధికారి కెప్టెన్ (భారత నావికాదళం) శివకుమార్ ఇచ్చిన వివరణ ఆధారంగా జూన్ 28న ది వైర్‌లో ప్రచురితమైన కథనంపై బిజెపి నేత దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ రూపొందించారు. 2025, జులై 11న మోరిగావ్‌లో అసోం పోలీసులు సెక్షన్ 152, బిఎన్ఎస్‌లోని ఇతర నిబంధనల కింద దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌పై జర్నలిస్టులు వరదరాజన్, 'దివైర్'లోని జర్నలిస్టులందరికీ బలవంతపు చర్యల నుండి రక్షణ కల్పించాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చిలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అయినప్పటికీ ఈ నెల 12న, పోలీసులు సమన్లు జారీ చేయడం గమనార్హం. ఇప్పుడు ఎటువంటి కారణం లేకుండానే అసోం పోలీసులు మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వరదరాజన్, థాపర్‌లను ఈ నెల 22న గౌహతిలోని క్రైమ్ బ్రాంచ్‌లో దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే అరెస్ట్ చేసే అవకాశం ఉందని హెచ్చరించారు" అని జర్నలిస్టుల సంఘాలు పేర్కొన్నాయి. క్రైం బ్రాంచ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం పట్ల ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ఇండియన్ వుమెన్ ప్రెస్ కార్ప్స్ సంఘాలు విస్మయం వ్యక్తం చేశాయి. తమ జర్నలిస్టులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం రెండు నెలల్లో రెండోసారి అని ద వైర్ సంస్థ పేర్కొన్నది. గౌహతికి చెందిన క్రైం బ్రాంచ్ పోలీసులు ప్రతీకార చర్యగా జర్నలిస్టులపై కేసు పెట్టినట్టు జర్నలిస్టు సంఘాలు విమర్శించాయి. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తేదీ ఆ సమన్లలో లేదు. ఎటువంటి నేరానికి పాల్పడ్డారో కూడా ఆ ఎఫ్ఐఆర్‌లో చెప్పలేదు. ఈ విషయమై గువహటి జాయింట్ పోలీసు కమిషనర్ మిగతా 7లో

సిద్ధార్థ వరదరాజన్ | కరణ్ థాపర్

ప్రశ్నించే పవన్ కల్యాణ్ మాట్లాడరేం

- ప్రీతిబాయి వర్ధంతి సభలో ప్రజాసంఘాల నాయకులు
- హైకోర్టు అనుమతివ్వకపోవడంతో యాత్ర వాయిదా

3

కొత్త ఉద్యోగాల్లో మందగమనం

- ద్వితీయార్థంలో 70 శాతం తగ్గొచ్చు
- టీమ్‌లీస్ ఎడ్‌టెక్ రిపోర్ట్

బిజెపి, టిడిపి, జనసేన కూటమితో వైసిపి కుమ్మక్కు

ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థిని బలపర్చడంపై సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండన

- కూటమి అభ్యర్థికి ఎలా మద్దతిస్తారని ప్రశ్న

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి అభ్యర్థిని బలపరచాలన్న వైసిపి నిర్ణయం రాష్ట్ర ప్రజలను వంచనకు గురిచేయడమేనని సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ కూటమి దేశ వ్యాప్తంగా మత కల్లోలాలు సృష్టిస్తూ ప్రజల మధ్య విషబీజాలు నాటుతోందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అదానీ లాంటి కార్పొరేట్లకు ధారదత్తం చేస్తోందని, అటువంటి బిజెపి ఆర్ఎస్ఎస్‌ల కొమ్ము కాయడం అంటే లౌకికతత్వానికి, మత సామరస్యానికి భంగం కలిగించడమే అవుతుందని పేర్కొన్నారు. బిజెపి, ఎన్‌డిఎ కూటమి రాష్ట్రానికి తీవ్ర హానీ చేస్తోందని, గత 11 సంవత్సరాలుగా విద్రోహ పూరిత విధానాలు అనుసరిస్తోందని ప్రత్యేక హోదా ఇవ్వలేదని, విభజన హామీలు అమలు జరపలేదని పేర్కొన్నారు. అఖరికి విశాఖ సీట్లు ప్లాంటు ప్రైవేటుపరం చేస్తున్నా రెండు ప్రధాన పార్టీలు గుడ్లప్పగించి చూస్తున్నాయని విమర్శించారు. ఒక్కొక్క డిపార్టుమెంటును 3ప్రైవేటుపరం చేసుకుంటూ పోతున్నా మాట్లాడటం లేదని, రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న ఇలాంటి ఎన్‌డిఎ కూటమికి వైసిపి ఎలా మద్దతు ఇస్తుందో రాష్ట్ర ప్రజలకు బహిరంగ వివరణ ఇవ్వాలని కోరారు. ప్రతిరోజూ ప్రజాస్వామ్యం కోసం, రాష్ట్ర హక్కుల కోసం టిడిపి నాయకత్వంలోని ఎన్‌డిఎ కూటమికి వ్యతిరేకంగా గంభీరమైన ప్రసంగాలు చేస్తున్న వైసిపి అదే ఎన్‌డిఎ కూటమికి చెందిన ఉపరాష్ట్రపతి అభ్యర్థిని బలపర్చడం అంటే టిడిపితో కుమ్మక్కు కావడం తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు.

రాజధాని నిర్మాణం పేరుతో ప్రజలపై భారాలు

2

4,687 అంగన్‌వాడీ కేంద్రాల అప్‌గ్రేడ్

- మినీ కార్యకర్తలకు మెయిన్ కార్యకర్తలుగా ప్రమోషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం 4687 మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న (పదో తరగతి ఉత్తీర్ణులైన) కార్యకర్తలను మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలుగా అప్‌గ్రేడ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం జీఓ ఆర్‌టి నెంబరు 116ని విడుదల చేసింది. వీరికి నెలకు గౌరవ వేతనంగా రూ.11,500 ఇవ్వనున్నారు. పది మంది కంటే తక్కువ పిల్లలుండే.. 340 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను కిలోమీటరు పరిధిలో ఉండే మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాల్లో దశలవారిగా విలీనం చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం పట్ల ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షకార్యదర్శులు కె సుబ్బరావమ్మ, జి బేబీరాణి హర్షం వ్యక్తం చేశారు. పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం ఈ ఉత్తర్వులు ఇచ్చిందని, ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలందరినీ అభినందిస్తున్నామని తెలిపారు. కాగా 1810 మినీ సెంటర్లలో 15 ఏళ్ల అనుభవం ఉన్న కార్యకర్తలకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు.

తీరం దాటిన వాయుగుండం

- అక్కడక్కడా వర్షాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారి దక్షిణ ఒడిశా, గోపాలపూర్‌ల సమీపంలో మంగళవారం తెల్లవారుజామున తీరాన్ని దాటింది. ఈ ప్రభావం వల్ల అక్కడక్కడా వర్షాలు కురిశాయి. 35 నుంచి 45 కిలోమీటర్ల వేగంతో ఈదుగు గాలులు వీచాయి. శ్రీకాకుళం జిల్లాల్లోని పలు మండలాల్లో వర్షాలు కురిశాయి. నరసన్నపేటలో తొమ్మిది మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆమదాలవలస మండలంలో వరి పొలాలు నీట మునిగాయి. నాగావళి నదిలో వరద ప్రవాహం క్రమేణా తగ్గుముఖం పట్టింది. శ్రీకాకుళం నగరంలోని పాతవంతెన వద్ద 16 వేల క్యూసెక్కుల నుంచి ఐదు వేల క్యూసెక్కులకు ప్రభావం తగ్గింది. వంశధారలో ఉదయం ఆరు గంటల వరకు 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, తర్వాత తొమ్మిది వేల క్యూసెక్కులకు పడిపోయింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో చిరుజల్లులు పడ్డాయి. నంద్యాల జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం పడుతుండడంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మహానంది మండలంలో అత్యధికంగా 20.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

దొందుదొందే

వి ఆర్

మన రాష్ట్రంలోని ప్రధాన పత్రికలు రెండు రాజకీయ శిబిరాలుగా చీలిపోయిచాలా కాలం అయ్యింది. ఒకరు అవునంటే మరొకరు కాదనడం అందుకు అనుగుణంగా వార్తలను వండివార్చడంలో పోటాపోటీలు పడుతుంటాయి. పరస్పర యుద్ధ భేరీలు మోగిస్తుంటాయి. అయితే ఈ రెండు శిబిరాలు ప్రజా సమస్యలను, ఉద్యమాలను తమ పత్రికల్లో కనిపించకుండా చేయడంలో ఒకే విధానాన్ని అనుసరిస్తున్నాయంటే ఆశ్చర్యంగా వున్నా అదే సత్యం. ఈ వారంలో రాష్ట్రంలో జరిగిన కొన్ని పరిణామాలు వాటిపట్ల ఈ పత్రికలు అనుసరించిన వైఖరులు గమనిస్తే వీరి ఏకత్వం మరింత స్పష్టంగా అర్థమవుతుంది.

మన రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న సమస్యల్లో పోలవరం ముంపు బాధితుల సమస్య అతి ప్రధానమైంది. ప్రకృతి ఒడిలో అతి నిర్మలంగా బ్రతికే గిరిజనులను పాలకులు అభివృద్ధి పేరుతో శాపగ్రస్తులుగా మార్చేసారు. విద్య, వైద్యం, రోడ్లు, మంచినీటి సదుపాయాలు లేని వెలివాడలలో అనాదబిడ్డలుగా వొదలేసారు. ఈ దీనుల పక్షాన నిలవాల్సిన ప్రధాన మీడియా అటువైపు కన్నెత్తి చూడడంలేదు. ఎప్పుడైనా చూస్తే పోలవరంలో అద్భుతం జరిగిపోతుందని, లేదా అధఃపాతాళానికి దిగజారిపోతుందని రాజకీయ కోణంలో రాయడమేతప్ప ప్రాజెక్టుకు సమిధలైపోతున్న గిరిజనుల బ్రతుకుల గురించి రాసిన పాపాన పోవడం లేదు. అంతరిక్షయానంలో దూసుకుపోతున్న నేటి కాలంలో డోలి మోతల్లో గర్భవతులను తీసుకవెడుతున్న గాథలు, రోజు కిలోమీటర్లకు పైగా నడిచి ప్రాథమిక పాఠశాలకు వెలుతున్న పసిబిడ్డలు, రోగాలతో రొప్పులతో ప్రాణాలు కోల్పోతున్న యువతీ యువకుల గురించి రాయడానికి వీరి కళంలో సిరావుండదు, వీరి పతిక్రల్లో చోటు దక్కదు. ముంపు బాధితుల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తేవడానికి, పార్లమెంట్‌లో వినిపించడానికి సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి, ఉత్తమ పార్లమెంటేరియన్ జాన్ బిట్రాస్ ఆధ్వర్యంలో రెండు బృందాలు గత శని, ఆదివారాల్లో అటవీ ప్రాంతాల్లో పర్యటించాయి. కొండలు, గుట్టలు, వాగులు, వంకలు దాటి చెట్టుకొకరు పుట్టకొకరుగా వున్న గిరిజనుల దరికి చేరి వారి బాధలను పరిశీలించిన వార్తలు ఈ రెండు శిబిరాల ప్రధాన మీడియా సంస్థలకు కనిపించలేదు. జాతీయ పత్రికలు రాసిన తర్వాత కూడా వీరి కనీస కంటిచూపునకు ఆ దీనుల బాధలు నోచుకోలేదు. ఇది ఏదో కాకతాళీయమో, అశ్రద్ధో, నిర్లక్ష్యమో అనుకుంటే పొరపాటు. ముంపు బాధితుల బాధలు రాస్తే దానికి కారణమైన కేంద్రం గురించి రాయాలి, కేంద్ర పాలకుల ఆగ్రహానికి గురికాకుండా వారి కరుణకటాక్షాలు తమ బాసుల మీద కొనసాగేలా చూడడం కోసం గిరిజన బిడ్డల గాథలను అడవికి ఒదిలేశారు.

నెల్లూరు జిల్లా కరేడు గ్రామంలో బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా రైతులు ఊరుమ్మడిగా ఏకమై పోరాడుతున్నారు. తమ గ్రామంలో తాము కలిసి కూర్చొని మాట్లాడుకోవడానికి వీలులేకుండా 30 యాక్ట్ నిర్బంధంలో గ్రామస్తులు బ్రతుకుతున్నారు. మా భూమి ఇవ్వం అంటున్నందుకు అక్రమ కేసులను ఎదుర్కొంటున్నారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించేందుకు, ఆ అన్నదాతలకు అండగా నిలిచేందుకు సోమవారం రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల నేతలు కరేడు గ్రామానికి వెళ్లారు. పరమార్శకు వచ్చిన నాయకులను ప్రజలు కలవకుండా గ్రామాన్ని వందల మంది పోలీసులు చుట్టుముట్టి నాయకులను బలవంతాన అరెస్టు చేసి పోలీసు స్టేషన్స్‌లో రోజంతా నిర్బంధించారు. ఇంత జరిగితే ఈ రెండు మీడియా శిబిరాలకు ఇది ప్రజా వార్తగా కనిపించలేదు. ఏదో ఇచ్చామంటే ఇచ్చామన్నట్లు ఓ మూలకు ఇంత రాశారు. ఇదే భూ సేకరణ మీద గతంలో పేజీల కొద్ది రాసిన వారు ఇప్పుడు దీర్ఘనిద్రలో వుంటే, అప్పుడు కీర్తించిన వారు కాగల కార్యం జరిగిపోతున్నందుకు మౌనదీక్షలో వున్నారు. కారణం ఏ కంపెనీ కోసం భూ సేకరణ జరుగుతుందో ఆ యజమాని ఈ రెండు మీడియా శిబిరాల రాజకీయ శ్రేయోభిలాషులకు అస్మదీయుడు కావడమే.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలం కార్మికులు పోరాడుతుంటే అది ఆంధ్రుల హక్కుగా వీరికి గుర్తుకు రావడంలేదు. వేలాది కాంట్రాక్టు కార్మికులను బలవంతాన తొలగిస్తున్నా, పర్మినెంట్ కార్మికులను విఆర్ఎస్ పేరుతో ఇంటికి సాగనంపుతున్నా, 33 యూనిట్లను ప్రైవేటికరిస్తున్న కేంద్రం గురించి రాయకపోవడం దేనికి సంకేతం? అయితే ఓ పత్రిక మాత్రం అప్పుడప్పుడూ ప్రయివేటీకరణ గురించి రాస్తోంది. గత పదకొండు సంవత్సరాలుగా రాష్ట్రానికి అన్ని రకాలుగా తీరని అన్యాయం చేస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వానికి మరోసారి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్ధతు ఇవ్వడానికి పాలక, ప్రతిపక్షాలు పోటీలు పడుతుంటే ప్రధాన మీడియా కనీసం పల్లెత్తు రాత రాయలేక పోవడం ఆంధ్రుల ఆత్మాభిమానానికి క్షోభ కాదా! నిత్యం సవాళ్ళు, ప్రతిసవాళ్ళు, ప్రాంతాల పేర్లతో పులులు, సింహాలు అంటూ ప్రగల్భాలు పలికే పార్టీల నేతలు కేంద్రం ముందు ఇంతలా సాగిలపడుతుంటే ఒక్క మాట కూడా రాయలేని స్థితికి మీడియా దిగజారడం పాఠకులు హర్షించరని గుర్తించాలి.

రౌడిషీటర్ రాసలీలలు, కిలాడి లేడి జిత్తులు, వారల కొద్ది ఒకే వార్తను పేజీల కొద్ది రాయడానికి స్థలం వున్న పత్రికల్లో ప్రజావార్తలకు చోటు దక్కాలంటే పాఠకుల నిశిత విమర్శతో పాటు అక్షరాన్ని నిజంగా ప్రజాపక్షం నిలుపుతున్నదేవరో గుర్తించాలి, వాటిని ఆదరించాలి.

సచివాలయ ఉద్యోగులను మాతృశాఖల్లో సర్దుబాటు చేయండి

- గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల శాఖను రద్దు చేసి ఉద్యోగులను మాతృశాఖలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల్లో సర్దుబాటు చేయాలని ఎపి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య వేదిక ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం ఐక్యవేదిక రాష్ట్ర ఛైర్మన్ ఎండి జానీపాషా, సెక్రటరీజనరల్ విప్పర్తి నిఖిల్‌కృష్ణ, రాష్ట్ర కన్వీనరు షేక్ అబ్దుల్ రజాక్ ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ వార్డు సచివాలయాల శాఖ ఉద్యోగులను కట్టు బానిసలుగా రోజు వారీ కూలీల మాదిరిగా చాకిరీ చేయించడం కోసమే పనిచేస్తోందని వారు పేర్కొన్నారు. అంతేకాని ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడడంలో పూర్తిగా విఫలమవుతోందని ఐక్యవేదిక నాయకులు విమర్శించారు. శాశ్వత సచివాలయ ఉద్యోగులుండగా నిర్వహణ కోసం అంటూ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో కాంట్రాక్టు ఉద్యోగులను ఈ శాఖలోకి తీసుకోవడం వృధా ఖర్చు అని పేర్కొన్నారు.

సెక్స్ వ్యాపారంపై సమగ్ర విచారణ, దోషులను శిక్షించాలి

- అత్యాచార వ్యతిరేక పోరాట వేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సెక్స్ వ్యాపారంపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని, అదే సమయంలో బాధితులకు న్యాయం చేయాలని అత్యాచార వ్యతిరేక పోరాట వేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం పోరాట వేదిక నేతలు డి.రమాదేవి(ఐద్వా), సుంకర పద్మశ్రీ (మహిళా కాంగ్రెస్), పిపద్మ కీర్తి వాసవ్య మహిళా మండలి(పిఓడబ్ల్యు), ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్దాపురంలో సెక్స్ వ్యాపారం చేస్తున్న భారతితో పాటు పలువురిని అరెస్ట్ చేసిన పోలీసులు ఆమెకు బెయిల్ వచ్చే విధంగా రిమాండ్ రిపోర్టు రాసి ఆమె పట్ల భక్తిని చాటుకున్నారని పోరాట వేదిక నేతలు విమర్శించారు. హోమ్‌శాఖ మంత్రి ఇంతవరకు పెద్దాపురం వ్యభిచారం కేసుకు సంబంధించి సిట్ వేయకపోవడం ఎవరి రక్షణ కొరకని వారు ప్రశ్నించారు. బాధిత మహిళకు పునరావాసానికి ఇంత వరకు చర్యలు లేవని, తక్షణమే ప్రభుత్వం ఆమెకు ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఇతర బాధిత మహిళలకు కూడా గౌరవంగా బతకడానికి సమగ్ర చర్యలు తీసుకోవాలని అత్యాచార వ్యతిరేక పోరాట వేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

చెరువులో మునిగి ఇద్దరు మృతి

ప్రజాశక్తి -కనిగిరి (ప్రకాశం జిల్లా)

చెరువులో దిగి ప్రమాదవశాత్తు ఇద్దరు మరణించిన ఘటన ప్రకాశం జిల్లా కనిగిరిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కనిగిరి పట్టణంలోని నక్కలతిప్పకు చెందిన బొందలపాటి ప్రవీణ్ కుమారుడు శివప్రసాద్ (19), కనిగిరి మున్సిపాలిటీ శంఖవరానికి చెందిన ఏనుగంటి ఎర్రయ్య కుమారుడు గౌతమ్ (17) ఈ నెల 17న సిఎస్‌పురం మండలంలోని భైరవకోన జలపాతం చూడడానికి వెళుతున్నామని చెప్పి.. ఇంటి నుంచి వెళ్లారు. 19న మంగళవారం మధ్యాహ్నం కనిగిరి మండలం పునుగోడు గ్రామస్తులు కొందరు కనిగిరి ఎస్ఐకి ఫోన్ చేసి.. పునుగుడు చెరువులో ఇద్దరి మృతదేహాలు కనిపిస్తున్నాయని సమాచారం అందించారు. కనిగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రెండు మృతదేహాలను బయటకు తీసి శివప్రసాద్, గౌతమ్‌గా నిర్ధారించారు. ఇద్దరు యువకులు పునుగోడు రిజర్వాయర్ వద్దకు ఈతకు వచ్చి చెరువులో దిగి ప్రమాదవశాత్తూ.. మునిగిపోయి మరణించినట్లు పోలీసులు గుర్తించారు.

ఇఒఐ పేరుతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ దారుణం

- విశాఖలో సిపిఎం ధర్నా

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

ధర్నాలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఇఒఐ) వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం విశాఖలోని జగదాంబ జంక్షన్లో ప్రదర్శన, ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ఇఒఐ పేరుతో కేంద్ర బిజెపి ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోని 44 విభాగాలను ప్రైవేటీకరించడానికి బిడ్లు ఆహ్వానించిందని, ఇది స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే చర్యని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు రివైవల్ ప్యాకేజీ ప్రకటించిన సందర్భంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ... ప్రభుత్వ రంగ విశాఖ ఉక్కు సెంటిమెంటుతో కూడినదని, దేశంలోనే దీనిని అగ్రగామి సంస్థగా నిలుపుతామని, ఉక్కు రంగంలో స్వయం సమృద్ధి సాధిస్తామని, ఇది తమ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. చంద్రబాబు, పవన్‌లు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిచిపోయిందని, ఉక్కును లాభాల బాట పట్టిస్తామని, కార్మికులకు, నిర్వాసితులకు న్యాయం చేస్తామని, ఆర్థిక ప్యాకేజీ తమ ప్రభుత్వం సాధించిన ఘనత అని చెప్పుకొచ్చారన్నారు. కానీ, ఆర్థిక ప్యాకేజీ కార్మికులను, ప్రజలను మభ్యపెట్టి ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను వేగవంతం చేయడానికేనని ఆచరణలో నిరూపణ అవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి, బి.జగన్, వి.కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తిలో ప్రతి అక్షరానికీ ప్రాముఖ్యత

- విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

ప్రజలు, పేదల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజాశక్తికి జనంలో ప్రత్యేక స్థానముందని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయం నవీకరణ, నూతన యంత్రాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రింటింగ్ మెషిన్‌ను, సిటిపి మెషిన్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి అక్షరం - ప్రజల పక్షంగా ప్రజాశక్తి నడక సాగిస్తూ మంచి స్థాయికి ఎదిగిందన్నారు. ప్రజాశక్తి రాసే ప్రతి అక్షరానికి ఎంతో విలువ ఉందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ.. పురోగమ శక్తుల ఆదరణతో ప్రజాశక్తి ముందుకెళ్తోందన్నారు. నేడు పత్రికలు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రజాశక్తిపై ప్రజలకు విశ్వసనీయత ఉందని, అదే పత్రిక బలమని అన్నారు. ఐఅండ్‌పిఆర్ విశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.సదారావు మాట్లాడుతూ.. ప్రజాశక్తితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. నిజాలను నిర్భయంగా రాసే ఈ పత్రిక దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ... అనేక ఒడిదుడుకులను తట్టుకుని ప్రజాశక్తి నిలబడిందన్నారు. పత్రిక ప్రస్థానాన్ని సిజిఎం వై.అచ్యుతరావు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ పూర్వ మేనేజర్ ఎస్.సుధాకర్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తదితరులు పాల్గొన్నారు. తొలుత మోటూరు హనుమంతరావు చిత్రపటానికి కలెక్టర్ హరేంధిర ప్రసాద్, కొరటాల సత్యనారాయణ చిత్రపటానికి ఎంవిఎస్.శర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సదారావు హాలును, ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. సిఎంఆర్ గ్రూపు సిజిఎం లింగమూర్తి తొలి కాపీని కొనుగోలు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రజాశక్తి ప్రింటింగ్ మెషిన్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో ఎంవిఎస్.శర్మ, అచ్యుతరావు

సోషల్ మీడియా అసత్యప్రసారాలపై ప్రత్యేక చట్టం

- హోం శాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సోషల్ మీడియాలో అసత్య ప్రసారాలు చేస్తూ , ప్రజలను అభద్రతా భావానికి గురిచేస్తున్న వారిపై చర్యల కోసం రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టం తీసుకురానున్నట్లు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సచివాలయంలోని పబ్లిసిటి సెల్‌లో మంగళవారం ఆమె మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో కొందరు ఉద్దేశ్యపూర్వకంగా విషం చిమ్ముతున్నారని అన్నారు. అటువంటి వారిని ఉపేక్షించేది లేదని చెప్పారు. అమరావతి మునిగిపోయిందని, ప్రకాశం బ్యారేజీ గేట్లు పనిచేయడం లేదని అసత్య ప్రసారాలను సోషల్‌మీడియాలో ఇష్టారీతిన ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై మూకుమ్మడి దాడి చేస్తున్నారన్నారు. అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎపి బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు ప్రతిపక్ష వైసిపి దానికి అనుబంధంగా ఉన్న మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని అనిత అన్నారు.

శ్రీకాంత్ పెరోల్ పై ...

నెల్లూరు జిల్లాకు చెందిన శ్రీకాంత్ అనే రౌడిషీటర్ పెరోల్ పొందడం పై మాట్లాడుతూ , ఆ పెరోల్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. అతను ప్రస్తుతం జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడని, ఆయనకు పెరోల్ రావడం వెనుక ఏవరున్నారనే అంశంపై విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. శ్రీకాంత్‌కు ఎస్కార్ట్‌గా వెళ్లిన సిబ్బందిపై కూడా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. అరుణ అనే మహిళ దిశా ఫౌండేషన్‌కు సెల్ఫ్ డిక్లేర్ సెక్రటరీ అని ఆమె నుంచి హోమ్ శాఖ పేషీకి ఫోన్ వచ్చిందని దానిపై కూడా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రాజధాని నిర్మాణం పేరుతో ప్రజలపై భారాలు

ఉప రాష్ట్రపతి ఎన్నికలపై టిడిపి, వైసిపి వైఖరి తెలియజేయాలి : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- వీరులపాడు (ఎన్‌టిఆర్ జిల్లా)

రాజధాని నిర్మాణం పేరుతో ప్రభుత్వం అప్పులు చేస్తూ ప్రజలపై మోయలేని భారాలు వేస్తోందని, ప్రజా ఉద్యమాలపై నిర్బంధాలు ప్రయోగిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. త్వరలో జరిగే ఉప రాష్ట్రపతి ఎన్నికలపై టిడిపి, వైసిపి వాటి వైఖరిని ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఎన్‌టిఆర్ జిల్లా వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామంలో మంగళవారం జరిగిన ఒక ప్రైవేట్ ఫంక్షన్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మంగళపూడి సుందరరావు గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్పెషల్ పర్పస్ వెహికల్ అకౌంట్‌తో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను అప్పుల ఊబిలోకి నెడుతోందన్నారు. ఈ అకౌంటుతో చేసే అప్పులపై ప్రపంచ బ్యాంకుకు, కేంద్ర ప్రభుత్వానికి లెక్కలు చెప్పాల్సిన అవసరం ఉంటుందని వివరించారు. రాష్ట్ర బడ్జెట్‌తో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే వీటిని తీర్చాల్సి ఉంటుందన్నారు. తద్వారా రాష్ట్ర ప్రజలపై 50 ఏళ్లపాటు అప్పుల భారం పడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సెల్ఫ్ ఫైనాన్స్ కాపిటల్ ఒక బోగస్ అన్నారు.

ఇది ప్రజలపై భారాలేసే పెద్ద ప్రాజెక్ట్ అని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల భవిష్యత్తులో లక్ష కోట్ల రూపాయల అప్పుల భారం ప్రజలపై పడుతుందన్నారు. రాష్ట్ర రాజధానిలో రైతులెవరూ సుఖసంతోషాలతో లేరని అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాజధానిపై ఆశలు పెంచుకున్నారని, ఈ ఏడాది కాలంలో పాలకుల విధానాల వల్ల వారి ఆశలు ఆవిరయ్యాయని అన్నారు. రాజధాని నిర్మాణంలో ప్రభుత్వం పూర్తిగా వెనకబడిందని తెలిపారు..

మీడియాతో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ఎన్‌డిఎ కూటమి అభ్యర్థికి ఎలా మద్దతిస్తారు వైసిపికి ప్రశ్న

టిడిపి మద్దతిస్తున్న ఎన్‌డిఎ కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థికి వైసిపి ఎలా మద్దతిస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి, రాష్ట్రంలో టిడిపికి వ్యతిరేకంగా పోరాడి వైసిపి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని విమర్శిస్తున్న జగన్... కేంద్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోడీ ప్రభుత్వం పట్ల మౌనంగా ఉండడం విస్మయం కలిగిస్తోందన్నారు. విశాఖ ఉక్కు విషయంలో కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండడం రాష్ట్ర ప్రజలను వంచించడమే అవుతుందని తెలిపారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపి ఒకరినొకరు విమర్శలు చేసుకుంటూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి అంట కాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయంగా ప్రజా ఉద్యమాలతో వామపక్షాలు మాత్రమే ముందుకెళ్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు, ప్రయివేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తోందన్నారు. విద్యా రంగం అభివృద్ధి పేరుతో ఎస్‌ఆర్ఎం తదితరాలకు వందల ఎకరాలు ధారాదత్తం చేస్తోందని తెలిపారు. ఉన్న విద్యా సంస్థలను అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంటలు పూర్తిగా వరద ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. పంటలు నష్టపోయిన రైతులకు తక్షణ సాయం కింద ఎకరానికి రూ.10 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాగులు, వంకలు పొంగిపోయి, వంతెనలు సైతం సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. దెబ్బతిన్న వంతెనల స్థానంలో కొత్త వాటిని నిర్మించాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద

కృష్ణమ్మకు పోటెత్తిన వరద

- శ్రీశైలం, సాగర్, పులిచింతలకు భారీగా ప్రవాహం
- ప్రకాశం బ్యారేజీకి కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- తగ్గుముఖం పట్టిన గోదావరి
- కాటన్ బ్యారేజీ వద్ద 9.90, భద్రాచలం వద్ద 36 అడుగులు

ప్రజాశక్తి - యంత్రాంగం

గోదావరి తగ్గుముఖం పట్టినా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. కృష్ణా పరివాహక ప్రాంతంలో జలాశయాలకు మంగళవారం వరద ప్రవాహం భారీగా పెరిగింది. శ్రీశైలం నుంచి సుమారు నాలుగు లక్షల క్యూసెక్కుల వరద దిగువ నాగార్జునసాగ్‌కు ప్రవహిస్తుండడంతో సాగర్ 26 గేట్లను ఎత్తి 4.10 లక్షల క్యూసెక్కులను దిగువ పులిచింతలకు విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజీకి 4.09 లక్షల క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. ఖమ్మం, కృష్ణా జిల్లాల నుంచి వచ్చే వరదతో ప్రకాశం బ్యారేజీకి 4.85 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. వచ్చిన నీటిని వచ్చినట్టు 70 గేట్ల ద్వారా సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. బుధవారం ఉదయానికి ఆరు లక్షల క్యూసెక్కులకు వరద పెరగవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు, గుంటూరు, ఎన్‌టిఆర్, కృష్ణా, బాపట్ల జిల్లాల పరిధిలోని 12 మండలాల్లోని 30 తీర ప్రాంత గ్రామాలకు వరద తాకిడి పెరిగింది. పల్నాడు జిల్లా దాచేపల్లి నుంచి బాపట్ల జిల్లా రేపల్లే వరకు అధికారులను ప్రభుత్వం అప్రమత్తం చేసింది.

భద్రాచలం వద్ద సోమవారం 39 అడుగులకు చేరిన గోదావరి క్రమేపీ తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 9.90 అడుగులు, భద్రాచలం వద్ద 36 అడుగుల నీటిమట్టాలు నమోదయ్యాయి. కాటన్ బ్యారేజీకి చెందిన 175 గేట్లను ఎత్తి 7,40,578 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం లంక గ్రామాలకు ఎటువంటి ఇబ్బందులు లేవని, మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి నీరు చేరితే మాత్రం లోతట్టు లంక గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

చింతూరు వద్ద శబరి 32 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది. చింతూరులోని కొండ వాగులు పొంగిపొర్లుతున్నాయి. జాతీయ రహదారి 30పై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిల వద్ద గండ్లు పడటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదురైంది. కొయగురు వాగు పొంగి ప్రవహించడంతో ఒడిశా - ఆంధ్రాకు రవాణా విషయంలో ఆటంకం ఏర్పడింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే లోకి వస్తున్న 8,00,702 క్యూసెక్కుల జలాలను జలవనరులశాఖ అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 31,720 మీటర్లు, స్పిల్‌వే దిగువన 23.150 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వేలేరుపాడు మండలంలో గోదావరి వరద ఉధృతికి వాగులు పొంగి, కాజ్‌వేలు నీట మునగడంతో సుమారు 25 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు మండలంలోనూ 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

విద్యుత్ సంస్థలు అప్రమత్తంగా ఉండాలి

- సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పలు జిల్లాలకు భారీ వర్ష సూచన నేపథ్యంలో విద్యుత్ సంస్థలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న వాతావారణ పరిస్థితుల దృష్ట్యా విద్యుత్ సంస్థల ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్‌ను ఆయన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తుఫాను అప్రమత్తతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణ ప్రణాళికలపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లిన సందర్భంలో వెంటనే స్పందించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకు అవసరమైన సామాగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని, రవాణా సౌకర్యాలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ప్రాణ నష్టానికి దారితీసే విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిరంతరాయంగా పని చేసే కంట్రల్ రూము ఏర్పాటు చేయాలని, నోడల్ అధికారులను నియమించాలని సిఎస్ ఆదేశించారు.

మహిళలకు భద్రతా కవచంలా “శక్తి ”యాప్

- రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ రాయపాటి శైలజ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళలకు భద్రతా కవచంలా శక్తి యాప్ ఉపయోగపడుతుందని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. విజయవాడ కెబిఎన్ కళాశాలలో మంగళవారం “మహిళల సంక్షేమం- భద్రత, రక్షణ- సాధికారికతపై” అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూమహిళల హక్కులు, భద్రత, సాధికారికతే మహిళా కమిషన్ లక్ష్యమని చెప్పారు. మహిళలు, బాలికలు శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఇటీవల సైబర్ నేరాలు అనే కొత్త ముప్పు పొంచి ఉందని, మహిళలు, డిజిటల్ భద్రతా చైతన్యం పెంచుకోవాలన్నారు. అవసరమైన సమయంలో ప్రభుత్వ హెల్ప్‌లైన్స్, చట్టపరమైన రక్షణకు ఉపయోగించుకోవాలన్నారు. సోషల్ మీడియాలో మహిళలపై వేధింపులు జరుగుతున్నాయని, నకిలీ అకౌంట్లు సృష్టించి అపవాదులు వేయడం, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు దుర్వినియోగం చేయడం వంటి వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు, ప్రత్యేక రక్షణ కోసం 181 హెల్ప్‌లైన్ ద్వారా తక్షణ సహాయం పొందాలన్నారు.ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి సభ్యురాలు రాధాకుమారి, మహిళా కమిషన్ కార్యదర్శి అనూరాధ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి షేక్ రుక్సానా సుల్తాన్ బేగమ్, కెబిఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.కృష్ణవేణి, కార్యదర్శి టి.శ్రీనివాస్. వన్‌స్టాఫ్ సెంటర్‌సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా ఇవ్వాల్సిందే

- డిసిఎంఎస్ వద్ద ఆందోళన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం డిసిఎంఎస్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు, రైతు సంఘాల నాయకులు

రైతులకు సరపడా యూరియా సరఫరా చేయాలని, అక్రమ నిల్వలు అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురం డిసిఎంఎస్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గత వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వేరుశనగ, మొక్కజొన్న, వరి, కంది, ఆముదం, అరటి పంటలకు యూరియా అవసరం ఏర్పడిందని తెలిపారు. రైతులకు సరఫరా యూరియాను అందించడంలో టిడిపి కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అనంతపురం డిసిఎంఎస్ వద్ద గత రెండు రోజులుగా రైతులు పడిగాపులు కాస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధార్ కార్డుకు రెండు బస్తాలే ఇవ్వడం, స్టాక్ లేదంటూ రైతులను వెనక్కి పంపుతుండడం తగదన్నారు. జిల్లాలో 3,519 టన్నులు యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ చెబుతున్నారని, అయితే, పిఎసిఎస్‌లు, డిసిఎంఎస్ వద్ద నో స్టాక్ బోర్డులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. పురుగుల మందులు కొంటేనే యూరియా అమ్ముతామని ఎరువుల దుకాణాల వారు నిబంధన విధిస్తున్నారన్నారు. మండల వ్యవసాయాధికారి వెంకటకుమార్ డిసిఎంఎస్ వద్దకు వచ్చి నాయకులతోనూ, రైతులతోనూ మాట్లాడారు. బుధవారం నుంచి రైతులందరికీ యూరియా అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిహెచ్.రాయుడు, వివిధ మండలాల రైతులు పాల్గొన్నారు.

వివేకా హత్య కేసు నిందితుల బెయిల్ రద్దుపై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిందితుల బెయిల్ రద్దుపై విచారణను సుప్రీంకోర్టు మంగళవారం వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్‌కె సింగ్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. కడప ఎంపి అవినాష్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలంటూ.. సునీతా నర్రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు గడువు విధించినందు వల్లే దర్యాప్తును ముగించినట్లు సిబిఐ చెబుతోందని, కానీ ఈ హత్య కేసులో మరింత దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. నిందితులు సాక్ష్యులను బెదిరించడమే కాకుండా.. సాక్ష్యాలను నాశనం చేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. సునీత దంపతులతోపాటు సిబిఐ అధికారి రాంసింగ్‌పైనా కేసు పెట్టారని, దస్తగిరి జైలులో ఉన్నప్పుడు నిందితుడు శివశంకర్ రెడ్డి కుమారుడు చైతన్య రెడ్డి జైలుకు వెళ్లి మరీ బెదిరించాడని ఆరోపించారు. అవినాష్ రెడ్డే వివేకా హత్యలో మాస్టర్ మైండ్ అని ధర్మాసనానికి న్యాయవాది సిద్ధార్థ లూథ్రా తెలిపారు. అనంతరం సిబిఐ తరపున వాదనలను అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు వినిపించారు. నిందితుల బెయిల్ రద్దు చేయాలని కోరారు. నిందితులను కాలపరిమితి లేకుండా జైలులో ఉంచడం మంచిది కాదని, కానీ ఈ హత్య జరిగిన తీరు చూస్తే... నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష చాలా తక్కువే అనిపిస్తోందని అన్నారు. కేసులో ఆధారాలు చెరిపేయడం, సాక్ష్యాధారాలు లేకుండా చేయడం నిరూపితమైందని చెప్పారు. హత్య అని తెలియకుండా అన్ని విధాలా నిందితులు ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇవన్ని దర్యాప్తులో పూర్తిగా బయట పడ్డాయని స్పష్టం చేశారు. నిందితుడు శివశంకర్ రెడ్డి కొడుకు చైతన్య రెడ్డి మెడికల్ క్యాంప్ పేరుతో కడప జైలుకు వెళ్లారని, అక్కడ కేసులో అప్రూవర్‌గా ఉన్న దస్తగిరిని బెదిరించినట్లు సాక్ష్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. అన్ని సాక్ష్యాలను ఎపి ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది హుజేఫా అహ్మదీ కోర్టుకు అందించారు. ఈ మేరకు తదుపరి దర్యాప్తు అవసరమో లేదో చెప్పాలని సిబిఐని ధర్మాసనం నిర్దేశించింది. దర్యాప్తులో నిందితులను కస్టోడియల్ విచారణ చేయాలో వద్దో కూడా చెప్పాలని పేర్కొంది. ఎంత మంది నిందితుల బెయిల్ రద్దు చేయాలన్న విషయాన్నీ చెప్పాలని సిబిఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. వివేకా కుమార్తె, అల్లుడు సునీతా రెడ్డి, నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి, సిబిఐ విచారణాధికారి రాంసింగ్‌పై పెట్టిన కేసులను క్వాష్ చేస్తామని వెల్లడించింది. చట్టాన్ని దుర్వినియోగం చేయడానికే వారిపై కేసు పెట్టారని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది.

అక్రిడిటేషన్ల మంజూరుకు మార్గదర్శకాలు జారీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం మీడియా అక్రిడిటేషన్ల మంజూరు చేసేందుకు మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం ‘ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా అక్రిడేషన్ రూల్స్ - 2025’ను అమోదించింది. అక్రిడేషన్ల మంజూరు చేసేందుకు రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో అక్రిడేషన్ కమిటీల ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీకి ఛైర్మన్‌గా సమాచార పౌర సంబందాల శాఖ డైరెక్టర్ వ్యవహరిస్తారని, రిజిస్టర్ జర్నలిస్ట్ సంఘాలు నుంచి 5 గురు సభ్యులు, ఎలక్ట్రానిక్ మీడియా, చిన్న పత్రికల సంఘాల నుంచి ఇద్దరు సభ్యులు, ఫోటో జర్నలిస్టుల సంఘం నుంచి ఒకరికి ప్రాతినిధ్యం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా అక్రిడేషన్ మంజూరుకు విధివిధానాలు, కమిటీల్లో సభ్యులుగా ఎంపిక చేసే యూనియన్లకు ఉండాల్సిన అర్హతలు తదితర అంశాలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

స్వాధీనం చేసుకున్న విదేశీ పక్షులు

విదేశీ పక్షుల అక్రమ రవాణా గుట్టురట్టు

- ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు
- అటవీ శాఖ రేంజర్ మురళీకృష్ణ

ప్రజాశక్తి - పలాస (శ్రీకాకుళం జిల్లా)

విదేశీ పక్షులను పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడుకు అక్రమంగా కారులో తరలిస్తున్న ఇద్దరు స్మగ్లర్లను అటవీశాఖ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి పలు జాతులకు చెందిన 236 విదేశీ పక్షులను స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ అటవీశాఖ కార్యాలయంలో పలాస అటవీ శాఖ రేంజర్ మురళీకృష్ణ నాయుడు ఈ కేసు వివరాలను వెల్లడించారు. పలాస మండలం సుమ్మాదేవి జాతీయ రహదారి సమీపంలోని ఒక లాడ్జి వద్ద విదేశీ పక్షులు అక్రమ రవాణా చేస్తున్నారన్న సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా, కారులో ఎగ్జైటియిట్ పక్షులు ఉన్నట్లు గుర్తించామన్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన గొంటి దాస్, అమృత ఘూయాన్ అనే ఇద్దరు స్మగ్లర్లు పక్షులను పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడుకు తరలిస్తూ మార్గమధ్యంలో ఇక్కడ నిలిపారని తెలిపారు. ఈ పక్షులను తమిళనాడులో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. స్మగ్లర్లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నామని, పక్షులను విశాఖపట్నం జూకు తరలిస్తామని చెప్పారు. గతంలోనూ 21 విదేశీ ప్రాణులను జాతీయ రహదారి మీదుగా తరలిస్తుండగా పట్టుకున్నామని మురళీకృష్ణ తెలిపారు.

స్థానిక సంస్థల సమస్యలు పరిష్కరించండి

- పిఆర్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసి సభ్యుల, స్థానిక సంస్థల సమస్యలు పరిష్కరించాలని ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వై.వి.బి రాజేంద్ర ప్రసాద్ కోరారు. సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మంగళవారం కలిసి సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు, స్థానిక సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలుతీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సిఎంను కలిసిన వారిలో ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

తిరుమల విధుల్లో కానిస్టేబుల్ నిజాయితీ

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో విధుల్లో ఉన్న ఎస్‌పిఎఫ్ కానిస్టేబుల్ జి రాజీవ్ నిజాయితీ చాటుకున్నారు. బెంగళూరుకు చెందిన జ్యోత్స్న ఈ నెల 18 రాత్రి శ్రీవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వెళ్తూ బ్యాగుల తనిఖీ స్కానింగ్ కేంద్రం వద్ద తన హ్యాండ్ బ్యాగ్ పోగొట్టుకున్నారు. అందులో రూ.2,07,494 నగదు ఉన్నట్లు టిటిడి సిబ్బందికి ఫిర్యాదు చేశారు. కాగా హ్యాండ్‌బ్యాగ్‌ను గుర్తించిన ఎస్‌పిఎఫ్ కానిస్టేబుల్ రాజీవ్ ఆమెకు సమాచారం అందించి భరోసా ధైర్యం చెప్పారు. మంగళవారం వేకువజామున వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో సదరు యాత్రికురాలికి హ్యాండ్‌బ్యాగ్‌ను అప్పగించి అందరి ప్రశంసలు పొందారు.

ఎండిసి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రకాష్ నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మాంసాహారం వినియోగాన్ని పెంచి, ప్రజలు పౌష్టికాహారం తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటానని ఆంధ్రప్రదేశ్ మీట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్ నాయుడు తెలిపారు. కార్పొరేషన్ చైర్మన్‌గా మంగళవాం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్పొరేషన్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

పింఛను తొలగించడంతో వికలాంగుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - యంత్రాంగం

గులాం బాషాను పరామర్శిస్తున్న ఎంపిడిఒ

పింఛను తొలగించడంతో మంగళవారం ఓ వికలాంగుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయన కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణంలోని అడ్డవాగు సమీపంలో నివాసం ఉండే గులాం బాషాకు నాలుగేళ్ల క్రితం పెరాలసిస్ రావడంతో ఒక కాలు, ఒక చేయి చచ్చుపడిపోయింది. దీంతో ఆయనకు ప్రభుత్వం వికలాంగుల పింఛను మంజూరు చేసింది. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి నెలా రూ.ఆరు వేలు పింఛను తీసుకుంటున్నారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన రీ వెరిఫికేషన్‌లో ఆయనను అనర్హుడిగా గుర్తించి అధికారులు పింఛను తొలగించారు. దీంతో 60 ఏళ్ల వయసులో ఉన్న తనకు ఆధారంగా ఉన్న పింఛను తొలగించడంతో దిక్కుతోచడం లేదని ఆవేదనకు గురయ్యారు. మనస్తాపంతో మంగళవారం ఉదయం ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న చాగలమర్రి ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్ బాష కేరళ ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం ఆయనను నంద్యాలకు తరలించారు. అధికారులు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

పింఛన్లు పునరుద్ధరించండి మహాప్రభో ఉమ్మడి అనంతపురంలో ఆందోళనలు

తమ పింఛన్ల తొలగింపును నిరసిస్తూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో మంగళవారం వికలాంగులు ఆందోళనకు దిగారు. అనంతపురం కార్పొరేషన్, నార్పల, కంబదూరు, కల్యాణదుర్గం, బుక్కరాయ సముద్రం, పుట్లూరు, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని ధర్మవరం, చిలమత్తూరు తదితర మండలాల్లో ఎంపిడిఒ, మున్సిపల్ కార్యాలయం వద్దకు వికలాంగులు చేరుకున్నారు. అక్కడి అధికారుల వద్ద వారి సమస్యను మొరపెట్టుకున్నారు. తాము పదేళ్లుగా వికలాంగ పింఛను తీసుకుంటున్నామని, ఇప్పుడు అకారణంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పింఛను పునరుద్ధరించాలని విన్నవించారు.

25న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు : ఎన్‌పిఆర్‌డి

అనర్హుల పేరిట అసలైన వికలాంగుల పింఛన్లను ప్రభుత్వం రద్దు చేయడాన్ని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర కమిటీ ఖండించింది. అర్హులందరికీ అదే స్లాబులో పింఛన్లు కొనసాగించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం వికలాంగుల పింఛన్ల నిధులను భారీగా తగ్గించుకునే చర్యల్లో భాగంగా అర్హుల పింఛన్ల తొలగింపునకు పాల్పడుతోందని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వైద్య పరీక్షలు నిర్వహించింది. తాజాగా పింఛన్ల రద్దు, పింఛను స్లాబ్‌ల్లో మార్పులు చేయాలని ప్రతిపాదిస్తోంది. రాష్ట్రంలో సుమారు లక్షమందిపై ప్రభుత్వ నిర్ణయ ప్రభావం పడనుందన్న వార్తలతో వికలాంగుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే నోటీసులు అందుకున్న వారు తమ పొట్టగొట్టారంటూ కన్నీటిపర్యంతమవుతున్నారు. 85 శాతం కన్నా పైబడ్డ వారికి గతంలో రూ.15 వేలు ఇవ్వగా నేడు ఆ వైకల్య శాతాన్ని తగ్గించి పింఛను స్లాబ్‌ను రూ.6 వేలుకు మార్చినట్టు తెలిపారు. 60 ఏళ్ల వయస్సు పైబడ్డ వికలాంగుల పింఛన్లను రూ.15 వేలు, రూ.6 వేల కేటగిరీ నుంచి మార్చి వృద్ధాప్య పింఛను కేటగిరీ రూ.4 వేలుకు తగ్గించారు. పెన్షన్ల రద్దు నోటీసులు అందుకున్న వారు తిరిగి అప్పీలు చేసుకుని, వైకల్యాన్ని నిర్ధారించుకుంటే పింఛను పునరుద్ధరిస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఆ ప్రక్రియ కఠినతరంగా ఉందని పేర్కొన్నారు. వికలాంగులను ఇప్పుడు ఆఫీసుల చుట్టూ తిరగాలని చెప్పడం అమానుషం. బోగస్ పింఛన్లు ఉంటే తొలగించవచ్చని, కానీ, ఆ పేరిట అర్హుల పింఛన్లను తొలగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బుధవారం నుంచి ఎక్కడికక్కడ వినతులు అందజేసి, ఈ నెల 25న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు చేపట్టనున్నట్టు తెలిపారు.

వధూవరులతో మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

వివాహ రిసెప్షన్‌లో మాజీ సిఎం జగన్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి సోదరుడు అనిల్ కుమార్‌రెడ్డి తనయుడు అనురాగరెడ్డి, వరదీక్షితల వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరయ్యారు. బెంగళూరు నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆయన చేరుకున్నారు. రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మాజీ మంత్రి ఆదిమూలం సురేష్, కడప మేయర్ సురేష్ బాబు, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, సుగవాసి బాలసుబ్రమణ్యం, అన్నమాచార్య యూనివర్సిటీ అధినేత చొప్పా గంగిరెడ్డి, కార్యదర్శి చొప్పా ఎల్లారెడ్డి పాల్గొన్నారు. జగన్ రాక సందర్భంగా ఆకేపాడుకు పెద్దఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. వారికి అభివాదం చేస్తూ తిరిగి 12.35 గంటలకు హెలికాప్టర్‌లో జగన్ బెంగుళూరుకు వెళ్లిపోయారు.

కళ్యాణదుర్గంలో మహిళా ప్రయాణికురాలితో మాట్లాడుతున్న ద్వారకా తిరుమలరావు

'స్త్రీశక్తి'తో 93 శాతం ఆక్యుపెన్సీ

- ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమల రావు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి (మహిళల ఉచిత బస్సు ప్రయాణం) పథకం ద్వారా ఆర్‌టిసి ఆక్యుపెన్సీ సరాసరి 93 శాతానికి చేరుకుందని ఆర్‌టిసి ఎండి ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఆర్‌టిసిపై ఏడాదికి రూ.రెండు వేల కోట్ల భారం పడినా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. మంగళవారం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడికశిర ఆర్‌టిసి డిపోలను ఆయన తనిఖీ చేశారు. స్త్రీ శక్తి పథకంపై మహిళలు, ఆర్‌టిసి సిబ్బందితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ... గడిచిన నాలుగు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 18 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్‌టిసి ఆక్యుఫెన్సీ సరాసరి 93కు చేరుకుందన్నారు. కొన్ని డిపోలలో వంద శాతం, మరికొన్ని డిపోల్లో 106 శాతం చేరుకుందని తెలిపారు. ఇప్పటికే 1050 కొత్త బస్సులు మంజూరయ్యాయని, పరిస్థితిని అంచనా వేసి మరో 1000 బస్సులు అదనంగా మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఎలక్ట్రికల్ బస్సులు, అందులో ఎసి సౌకర్యం ఉన్న బస్సుల్లో కూడా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు కసరత్తు చేస్తోందన్నారు. అంతరాష్ట్ర సర్వీసుల విషయంలో నెలకొన్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లామని, ఆంధ్ర సరిహద్దు వరకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేలా అవకాశాలు ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ఆర్‌టిసి చైర్మన్ పూలనాగరాజు, ఆయా డిపోల ఆర్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

గండికొట్టి నీరు తరలించండి

- అధికారులకు మంత్రి నారాయణ ఆదేశం
- వర్షపు నీరు నిలిచిపోవడంపై ఆగ్రహం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి పరిధిలో నీరుకొండ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచి ముంపు ఏర్పడటంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజులు గడుస్తున్నా ముంపు నీటిని తొలగించేందుకు అవసరమైన ప్లాను లేకపోవడాన్ని నిలదీశారు. మంగళవారం రాజధానిలో ముంపు నీరు నిలిచిన ప్రాంతంలో నారాయణ పర్యటించారు. కొండవీటివాగు వద్ద వంతెన నిర్మాణంతో నీరు నిలిచిపోయిందని అధికారులు మంత్రికి వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న మట్టిని తొలగించడంతోపాటు అవసరమైతే జాతీయ రహదారి వద్ద స్వల్పంగా గండికొట్టి నీటిని మళ్లించాలని కోరారు. అక్కడే మీడియాతో మాట్లాడుతూ వర్షపునీరు రెండు గ్రామాల పరిధిలో నిలిచిందని, గుంతల్లో నీరు నిలిస్తే ముంపుగా వైసిపి నాయకులు ప్రచారం చేయడం సరికాదని వివరించారు. కొండవీటివాగు ప్రవాహానికి అడ్డుగా ఉన్న మట్టిని వేగంగా తొలగించే పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఎవరు ఎన్ని అనుకున్నా అమరావతి పనులు జరుగుతూనే ఉంటాయని పేర్కొన్నారు. రాజధాని ముగిగిపోయిందని ప్రచారం చేస్తున్నవారు వచ్చి వాస్తవాలు చూడాలని పేర్కొన్నారు.

'ఆదరణ'లో మత్స్యకారులకు ప్రాధాన్యత

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మత్స్యకారులకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు మంత్రి సవితను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,ఆదరణ 3.0లో మత్స్యకారులకు ప్రాధాన్యమిస్తామని, ఆధునిక పరికరాలు అందజేస్తాని వెల్లడించారు. వేట విరామ సమయంలో ఇచ్చే ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేసి రూ.20 వేలకు పెంచినట్లు చెప్పారు. 1.29 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్లు ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. మత్స్యకారులకు 50 ఏళ్లకే పెన్షన్ ఇచ్చిన ఘతన టిడిపిదేనన్నారు. లీటర్ డీజిల్‌పై రూ.9 రాయితీ అందజేస్తున్నామని, వేటకు వెళ్లి ప్రమాద వశాత్తు మరణిస్తే మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం అందజేస్తామన్నారు.

సిబ్బంది పనితీరు ప్రోత్సాహానికి చర్యలు

కార్పొరేట్ విద్యా సంస్థల వసతి గృహాలకు దీటుగా బిసి సంక్షేమ వసతి గృహాలను తీర్చిదిద్దనున్నట్లు మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఇందుకోసం ఒకవైపు సౌకర్యాలను మెరుగుపచడంతోపాటు మరోవైపు సిబ్బంది పనితీరును ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉత్తమ పనితీరు కనబరిచిన వసతి గృహాల వార్డెన్లకు బదిలీలు, పదోన్నతుల్లో ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 104 బిసి సంక్షేమ వసతి గృహాల్లో ఎస్ఆర్ శంకరన్ రిసోర్సు సెంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వసతి గృహాల్లో ఫేషియల్ రికగ్నైజేషన్ వ్యవస్థతో అటెండెన్స్ నమోదును అమలు చేస్తున్నట్లు తెలిపారు. వసతి గృహాల మరమ్మతులకు రూ.20 కోట్లు, వంటపాత్రలు, విద్యార్థులకు అవసరమైన సామాగ్రి కొనుగోలుకు రూ.18 కోట్లు అందజేశామన్నారు. వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆరగ్య భద్రత అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. నస్నబియ్యం భోజనం అందిస్తున్నామని, సిసి కెమెరాలు, ఇర్వర్టర్లు, స్వచ్ఛమైన తాటునీటికి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

గౌరమ్మను డోలీలో ఆస్పత్రికి తరలిస్తున్న గ్రామస్తులు

గిరిజనులకు తప్పని కష్టాలు

- డోలీతో గర్భిణిని ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

రహదారి సదుపాయం లేకపోవడంతో గిరిజనులకు కష్టాలు తప్పడం లేదు. ప్రసవ వేదన అనుభవిస్తున్నా, అనారోగ్యంతో బాధపడుతున్నా డోలీ మోత తప్పడం లేదు. విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణానికి ఏడు కిలోమీటర్ల దూరం గల గోపాలరాయుడు పేట పంచాయతీ కొత్తబట్టివలస గ్రామానికి చెందిన సీదరపు గౌరమ్మకు మంగళవారం పురిటి నొప్పులు వచ్చాయి. ఆస్పత్రికి వెళ్లేందుకు రోడ్డు సదుపాయం లేకపోవడంతో చేసేది లేక డోలీలో బొబ్బిలి ప్రభుత్వాసుపత్రికి ఆమెను తీసుకువచ్చారు. పండంటి బిడ్డకు గౌరమ్మ జన్మనిచ్చింది. ఈ సందర్భంగా ఐద్వా, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు స్పందిస్తూ.. పట్టణాలకు సమీపంలోని గ్రామాలకు కూడా పాలకులు రోడ్లు వేయకపోవడంతో గిరిజనులకు డోలీ మోతలు తప్పడం లేదన్నారు. అధికారులు తక్షణం స్పందించి కొత్తబట్టివలస, అక్కినేని వలస, మోసూరువలస, సియన్నవలస, క్రుపాయి వలస తదితర గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

కొత్త ఉద్యోగాల్లో మందగమనం

- ద్వితీయార్థంలో 70 శాతం తగ్గొచ్చు
- టీమ్‌లీస్ ఎడ్‌టెక్ రిపోర్ట్

న్యూఢిల్లీ : దేశంలో కొత్త ఉద్యోగ నియామకాలు అమాంతం పడిపోనున్నాయని రిపోర్టులు హెచ్చరిస్తున్నాయి. ట్రంప్ టారిఫ్‌లతో అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులకు తోడు దేశీయంగా డిమాండ్ తగ్గడం, కృత్రిమ మేధ (ఎఐ) తదితర పరిణామాల నేపథ్యంలో ఈ ఏడాది ద్వితీయార్థంలో అభ్యర్థులకు గడ్డుకాలమేనని టీమ్‌లీస్ ఎడ్‌టెక్ కెరీర్ తన రిపోర్ట్‌లో వెల్లడించింది. 2025 జులై నుంచి డిసెంబర్ కాలంలో ఫ్రెషర్ల నియామకాలు ఏకంగా 70 శాతం తగ్గనున్నట్లు వెల్లడించింది. జనవరి నుంచి జూన్ కాలంలోని ప్రథమార్థంతో పోల్చితే నాలుగు శాతం పాయింట్ల తగ్గుదల చోటు చేసుకోనుందని విశ్లేషించింది. మే నుంచి జులైలో నిర్వహించిన ఈ అధ్యయనంలో 1065 సంస్థల అభిప్రాయాలను సేకరించింది.

టీమ్‌లీస్ ఎడ్‌టెక్ రిపోర్ట్ వివరాలు.. నూతన నియామకాల్లో తగ్గుదలను సూచిస్తున్నప్పటికీ.. పలు రంగాల్లో మాత్రం కొంత ఆశాజనంగా ఉంది. ఇ-కామర్స్, రిటైల్, ఐటి రంగాలు డిజిటల్ రూపాంతరంతో ఆశాజనకంగా ఉన్నాయి. సాంకేతిక, సాఫ్ట్ స్కిల్స్ కలిగిన ఫ్రెషర్‌లకు అవకాశాలు దక్కొచ్చు. చిన్న సంస్థలు ఫ్రెషర్‌లను నియమించేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నాయి. ఐఒటి ఇంజనీర్, క్లౌడ్ ఇంజనీర్, జూనియర్ వెబ్ డెవలపర్, కంటెంట్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వంటి పాత్రలకు డిమాండ్ ఉంది. అప్రెంటిష్ నియామకాల్లో బెంగళూరు, చెన్నయ్, పూణే నగరాలు ముందు వరుసలో ఉన్నాయి. ఇ-కామర్స్, టెక్నాలజీ స్టార్టప్‌లలో బలమైన నియామకాలకు అవకాశాలున్నాయి. టీమ్‌లీస్ ఎడ్‌టెక్ వ్యవస్థాపకుడు శాంతను రూజ్ పేర్కొన్నారు. పెద్ద సంస్థలతో పోల్చితే చిన్న సంస్థల్లోనే ఎక్కువ నియామకాలు ఉండొచ్చన్నారు. తయారీ, ఐటి రంగాల్లో బహుళ నైపుణ్యాలు ఉన్న వారికే ఎక్కువ అవకాశాలు దక్కుతున్నాయన్నారు. అయితే ఏఏ రంగాల్లో ఉద్యోగాలు తగ్గొచ్చనే విషయాన్ని టీమ్‌లీస్ తన రిపోర్ట్‌లో స్పష్టం చేయకపోవడం గమనార్హం.

జియో చౌక ప్లాన్‌కు పాతర

- ఇక కనీసం రూ.299 చెల్లించాల్సిందే

న్యూఢిల్లీ : ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో తమ వినియోగదారులకు వాతలను, కోతలను కొనసాగిస్తోంది. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులకు ఎక్కువగా ఉపయోగించే బేసిక్ ప్రీ-పెయిడ్ ప్లాన్‌ను తాజాగా ఎత్తివేసింది. రూ.249 ధరలో 28 రోజులపాటు రోజుకు 1జిబి డేటా అందించే ఈ ప్లాన్‌ను నిలిపి వేసింది. దీంతో ఇకపై రోజుకు ప్రాథమికంగా 1.5జిబి డేటాతో లభించే రూ.299 ప్లాన్ అవకాశాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ మార్పు అమల్లోకి వచ్చింది. జియోలో 249 ప్లాన్ రీచార్జ్‌ను తొలగించింది. గతేడాది దాదాపుగా తమ ప్లాన్ల ధరలను 30 శాతం మేర పెంచిన ఈ కంపెనీ తాజాగా బేసిక్ ప్లాన్లను ఎత్తివేసి తన ఆదాయాన్ని పెంచుకోవాలని నిర్దేశించుకుంది. ఇది వినియోగదారులకు తీవ్ర భారం కానుంది.

రూ.4 లక్షల కోట్ల ఎగుమతులపై ట్రంప్ ప్రభావం

- మంత్రి జతిన్ ప్రసాద వెల్లడి

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన అధిక సుంకాలు ఎగుమతులపై తీవ్ర ప్రభావమే చూపనున్నాయి. భారత సరుకులపై 50 శాతం టారిఫ్‌లను వేయడంతో 48.2 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.4 లక్షల కోట్ల) విలువైన ఎగుమతులపై ప్రతికూలత నెలకొందని కేంద్ర వాణిజ్య శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద సోమవారం లోక్‌సభకు తెలిపారు. 2024 వాణిజ్య విలువ ప్రకారం.. భారతదేశం నుంచి అమెరికాకు 48.2 బిలియన్ డాలర్ల వస్తువులు ఎగుమతయ్యాయన్నారు. భారత్‌పై ట్రంప్ 25 శాతం పరస్పర సుంకాలను విధించారు. రష్యన్ చమురు కొనుగోళ్లపై అదనంగా 25 శాతం లెవీ విధించారు. దీంతో మొత్తం టారిఫ్‌లు 50 శాతానికి చేరాయి. "ఆగస్టు 7 నుంచి భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే కొన్ని వస్తువులపై 25 శాతం రేటుతో పరస్పర సుంకం విధించబడింది. ఆగస్టు 27 నుంచి అదనంగా 25 శాతం సుంకం అమల్లోకి రానుంది. అయితే కేంద్రం భారత ఆసక్తులను కాపాడటానికి కట్టుబడి ఉంది." అని మంత్రి తెలిపారు. ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఐదు రౌండ్ల చర్చలు జరగ్గా.. ఆరో రౌండ్ కోసం ఆగస్టు 25న అమెరికా బృందం రావాల్సి ఉన్నప్పటికీ వాయిదా పడింది.

టెక్నాలజీ కెరీర్ కోసం హెచ్‌సిఎల్ టెక్ టెక్‌బీ ప్రోగ్రాం

- ఇంటర్‌తోనే వృత్తి అవకాశాలు

హైదరాబాద్ : ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సిఎల్‌టెక్ తన కీలక టెక్‌బీ ఎర్లీ కెరీర్ ప్రోగ్రాం ద్వారా హైదరాబాద్‌లోని ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు సాంకేతిక వృత్తి అవకాశాలను కల్పిస్తున్నామని హెచ్‌సిఎల్ టెక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బరామన్ బి తెలిపారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పలు యూనివర్శిటీల భాగస్వామ్యంతో అందిస్తున్న శిక్షణ ఇస్తామన్నారు. ఈ ప్రోగ్రాం ఫీజు రూ.1.40 లక్షల నుంచి ప్రారంభమవుతుందన్నారు. శిక్షణ ప్రారంభంలోనే విద్యార్థులకు స్టైపండ్ కూడా అందించనున్నామన్నారు. ఈ ఏడాది కోర్సును పూర్తి చేసిన వారికి రూ.2.20 లక్షల నుంచి వేతన ప్యాకేజీ ప్రారంభమవుతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఎంపిక ఉంటుందని.. అర్హులైన వారికి విజయవాడ, మధురై, నోయిడా, బెంగళూరు సెంటర్లలో

ప్రశ్నించే పవన్ కల్యాణ్ మాట్లాడరేం

- ప్రీతిబాయి వర్ధంతి సభలో ప్రజాసంఘాల నాయకులు
- హైకోర్టు అనుమతివ్వకపోవడంతో యాత్ర వాయిదా

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

మీడియాతో మాట్లాడుతున్న పార్వతి

తాము అధికారంలోకి వస్తే తొలిసారిగా ప్రశ్నించేది ప్రీతిబాయి మృతి గురించేనని మాట్లాడిన పవన్ కల్యాణ్ జాడే కనిపించలేదని, ఆయన ఎక్కడున్నారని పలు దళిత, ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నించారు. తన కూతురు మృతికి కారణమైన కారకులను కఠినంగా శిక్షించాలని, తమకు న్యాయం చేయాలని కోరుతూ కర్నూలు నుంచి అమరావతికి న్యాయపోరాట యాత్రను చేపట్టేందుకు ప్రీతి తల్లిదండ్రులు మంగళవారం సిద్ధమవ్వగా కోర్టు అనుమతించకపోవడంతో వాయిదా వేశారు.

ఈ నెల 22న యాత్ర అనుమతిపై కోర్టు తీర్పును ఇవ్వనుందని, న్యాయం జరిగే వరకూ పోరాటాన్ని ఆపబోమని ప్రీతి తల్లిదండ్రులు పార్వతి, రాజు నాయక్ తెలిపారు. ప్రీతి ఎనిమిదవ వర్ధంతి సందర్భంగా సుంకేసుల రోడ్డులోని స్మశాన వాటిక వద్ద దళిత సంఘాల నాయకులతో కలిసి తల్లిదండ్రులు నివాళు లర్పించారు. అనంతరం అక్కడి నుంచి రోజా వీధి, మున్సిపల్ కార్యాలయం, చిన్న పార్కు, కోట్ల సర్కిల్, పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లయినా తన కూతురు మరణానికి సమాధానం దొరకని దౌర్భాగ్య స్థితిలో తానున్నానన్నారు. కేసును విచారించడానికి ప్రభుత్వం దగ్గర నిధులు లేవని చెప్పడం సిగ్గుచేటన్నారు. న్యాయం కోసం యాత్రను ప్రారంభిస్తానంటే ప్రభుత్వానికి అంత భయం ఎందుకని ప్రశ్నించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు మాట్లాడుతూ.. ప్రీతి బాయి కేసును అణచివేసేందుకు అడుగడుగునా ప్రయత్నాలు జరిగాయని అన్నారు. దళిత మహిళా జెఎసి చైర్మన్ మంచాల నాగమల్లేశ్వరి మాట్లాడుతూ... మహిళలకు అండగా ఉంటానన్న మంత్రి నారా లోకేష్ ఎందుకు స్పందించడం లేదన్నారు. దళిత సంఘాల జెఎసి నాయకులు ఏట ఓబులేసు, కాటికాపర్ల సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణ, డిబిఎస్ నాయకురాలు వేల్పుల జ్యోతి, అడ్వకేట్ మోహన్ కృష్ణ, దళిత, డివైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ఇంటికి వెళ్లాలంటే ప్రత్యేక అనుమతులు తీసుకోవాలా?

- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ప్రజశక్తి -అనంతపురం ప్రతినిధి

'తాడిపత్రిలోని నా ఇంటికి వెళ్లాలంటే ప్రత్యేక అనుమతులు తీసుకోవాలా? ఒకవేళ అలా ఎవరైనా అనుమతి ఇస్తామంటే అందుకు అనుగుణంగా దరఖాస్తు పెట్టుకుంటా' అని పోలీసులనుద్దేశించి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వ్యాఖ్యానించారు. హైకోర్టు అనుమతితో తాడిపత్రి పట్టణంలోకెళ్లేందుకు సోమవారం పెద్దారెడ్డి ప్రయత్నించడం, పోలీసులు అడ్డుకోవడంతో వెనక్కి వెళ్లిన విషయం తెలిసిందే. ఈ విషయమై మంగళవారం అనంతపురంలో మీడియాతో ఆయన మాట్లాడారు. తాను తాడిపత్రికి వెళ్లడానికి న్యాయస్థానం అనుమతిచ్చినా పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. నా ఇంటికెళ్లాలంటే ప్రత్యేక వీసా ఏదైనా కావాలమో చెబితే.. అందుకనుగుణంగా దరఖాస్తు పెట్టుకుంటానని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అరాచకాలు చేశానని జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభాకర్‌రెడ్డి, అతని అనుచరులు తప్ప తనను ఎవ్వరూ అడ్డుకోరని చెప్పారు. తాడిపత్రిలోకి రాకుండా తనను ప్రజలెవరైనా అడ్డుకుంటే తన ఇంటిని జెసికి రాసిస్తానని సవాల్ విసిరారు.

PR Agro Nutri (Pvt.) Limited
Room No. 69, Srinivasa Merchants Welfare Association, Gooty Road, Ananthapur-515001
CIN No.U24299TG2002PTC039042

PR Agro Nutri Private Limited వారి తరుపున రైతులకు మరియు వ్యవసాయ శాఖ వారికి, దిగువ తెలిపిన 100% నీటిలో కరిగే మిశ్రమ న.భా.పొ ఎరువులను కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ గెజిట్ నోటిఫికేషన్ నెం. 2900 (E) తేది 24 అక్టోబర్ 2015 నిబంధనలకు లోబడి విదేశాల నుండి దిగుమతి చేసుకుని, త్వరలో 1కి,5కి మరియు 25 కిలోల బస్తాల్లో అమ్మకం చేయదలచుకున్నామని తెలియచేయుటకు సంతోషిస్తున్నాము.

20-20-20 | 19-19-19 | 13-40-13 | 15-15-30
17-10-27 | 16-08-32+2MgO | 18-9-27+2MgO
26-12-12+2MgO | 15-30-15+ | 14-7-21+2MgO

మరిన్ని వివరాలకు: 9440144535, 9440404933 ఫోన్ నంబరులో సంప్రదించగలరు.
mail id : pran_hyd@yahoo.com

సంపాదకీయం

ఆంధ్రుల హక్కును ముక్కలు చేస్తారా?

ఆంధ్రుల హక్కుగా ఆవిర్భవించిన విశాఖ ఉక్కును ముక్కలు ముక్కలుగా చేసి, కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వేగవంతం చేయడం దుర్మార్గం. 32 మంది ప్రాణత్యాగంతో పురుడుపోసుకుని, ఆంధ్రుల ఆత్మగౌరవానికి, ఆర్థిక స్వావలంబనకు, సామాజిక ప్రగతికి వెన్నుదన్నుగా ఉన్న కర్మాగారాన్ని ప్రైవేటీకరించకుండా అడ్డుకుంటామని ఎన్నికల ముందు హామీలు గుప్పించిన రాష్ట్రంలోని టిడిపి కూటమి పెద్దలు నోరుమెదపకపోవడం శోచనీయం. ప్లాంట్‌లో కీలకమైన 210 మెగావాట్ల కేప్టివ్ పవర్‌ప్లాంట్, థర్మల్ పవర్‌ప్లాంట్ సహా 44 విభాగాలను ప్రైవేటీకరించేందుకు టెండర్లను ఆహ్వానించడం సరికాదు. ఆది నుంచీ ప్రభుత్వరంగాన్ని తెగనమ్ముతూ... కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోడీ సర్కారు 2021లోనే విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని మంత్రివర్గంలో నిర్ణయించింది. ప్లాంట్‌ను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని, ప్రధానితో మాట్లాడి ప్లాంట్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి ఆ తరువాత ప్రకటించారు. పలుమార్లు విశాఖలో సభలకు హాజరై అనర్గళంగా మాట్లాడినా... ఈ అంశంపై ప్రధానిది మూగనోమే. ఇటీవల పార్లమెంట్‌లో ఓ ప్రశ్నకు సమాధానంగా విశాఖప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోలేదని, వ్యూహాత్మక భాగస్వామికి అప్పగిస్తామని మోడీ సర్కారు చెప్పడం...ప్రభుత్వ రంగంపైనున్న కక్షపూరిత వైఖరే.

తాము అధికారంలోకి వస్తేనే విశాఖ ప్లాంట్‌ను పరిరక్షించడం సాధ్యమవుతుందన్న టిడిపి కూటమి పెద్దల మాటలను నమ్మిన స్థానిక ప్రజలు ఇక్కడి ఎమ్మెల్యేకు రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో విజయాన్ని అందించారు.

ఆ తరువాత రూ.11,440 కోట్ల ప్యాకేజిని కేంద్రప్రభుత్వం ప్రకటించడంతో... ప్రైవేటీకరణ ఆగిపోయిందంటూ సిఎం, డిప్యూటీ సిఎం మొదలు కూటమి పెద్దలంతా ఊరూవాడా ప్రచారం చేశారు. ఆ ప్యాకేజీ ఫ్యాక్టరీని ముస్తాబు చేసి, కార్పొరేట్లకు తెగనమ్మేందుకేనని, అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలేవీ లేవని అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. 73 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధిస్తామని, మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ఏర్పాటు చేస్తామని ప్రకటిస్తూ... పర్మినెంట్ కార్మికులకు విఆర్ఎస్‌లు ఇవ్వడం, కాంట్రాక్టు కార్మికులను తొలగించడంపై ఆందోళనలు భగ్గుమన్నాయి. కార్మికులకు జీతాలు బకాయిలు పెట్టడం, చాప కింద నీరులా ప్రైవేటీకరణ ప్రక్రియను సాగిస్తుండటం కేంద్రం దుర్నీతికి నిదర్శనం. ప్రభుత్వ రంగంలో దేశానికి మణిహారంలా ఉన్న విశాఖ ఉక్కుకు క్యాప్టివ్ మైన్స్ ఇవ్వకపోవడమే నష్టాలకు కారణం. కీలకమైన ఉక్కు ఖనిజాన్ని టన్నుకు రూ.2000 నుంచి రూ.8000 వరకూ అదనంగా చెల్లించాల్సి రావడం, కీలకమైన గంగవరం పోర్టును అదానీకి కట్టబెట్టి సకాలంలో వేగన్ల ద్వారా ఖనిజం అందకుండా అడ్డుకోవడం, రైల్వే వేగన్లను సైతం సక్రమంగా కేటాయించకపోవడం, తగినన్ని నిధులు లేక నిల్వ చేసుకోలేని పరిస్థితులు...ఇలా కేంద్రంలోని ప్రభుత్వాల దుర్మార్గపు ప్రైవేటీకరణ చర్యలే నష్టాల పాలు చేస్తున్నాయి. మైన్స్‌ను కేటాయించాలని, ప్రభుత్వరంగంలోని సెయిల్‌లో విలీనం చేయాలని కార్మికులు ఆందోళన చేస్తున్నా... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించింది లేదు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల్లో భారీ కర్మాగారాలను నిర్మించడానికి బదులు... విశాఖ ఉక్కుకు పోటీగా ప్రైవేటురంగంలో ఆర్సెలార్ మిట్టల్ పరిశ్రమను నక్కపల్లిలో ఏర్పాటు చేసేందుకు సిఎంతోపాటు కూటమి సహకరించడం సిగ్గుచేటు. ఇంకా పనులే ప్రారంభం కాని ఈ ఫ్యాక్టరీకి కేప్టివ్ మైన్స్‌ను కేటాయించాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని స్వయంగా సిఎం ప్రధానిని కోరడం, ఇటీవల ఎంపిలు వినతులు ఇవ్వడం, విశాఖ ప్లాంట్‌ను ప్రస్తావించకపోవడం దేనికి సంకేతం! 30 వేల మందికి ప్రత్యక్షంగా, లక్ష మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి, సామాజిక న్యాయానికి అండగా ఉన్న కర్మాగారాన్ని కార్పొరేట్ పెద్దలకు కట్టబెడితే ఒనగూరే ప్రయోజనమేమిటో కేంద్రం సమాధానం చెప్పాలి. రెండు లక్షల కోట్లకుపైగా విలువైన 22 వేల ఎకరాలను కార్పొరేట్లకు అప్పగించే కుట్రలు... వాటిని అప్పగించిన 16,500 మందికిపైగా రైతుల ఆశలను నట్టేటముంచడమే. ప్రైవేటురంగంలో అద్భుత ఫలితాలు వస్తాయంటూ... అప్పులన్నీ తీర్చేసి కారుచౌకగా టాటాలకు అమ్మేసిన తరువాత ఎయిర్ ఇండియా వెలగబెడుతున్న నిర్వాకం లాంటి అనేక అనుభవాలున్నా.. వైఖరి మార్చుకోని మోడీ సర్కారు తీరు దుర్మార్గం. ఎన్‌డిఎ కూటమిలో భాగస్వాములైన టిడిపి, జనసేన, సహకరిస్తున్న వైసిపి పెద్దలు ఇప్పటికైనా జనహితం కోసం మారాలి. ఉప రాష్ట్రపతి ఎన్నికను అందుకు వినియోగించుకునే ప్రయత్నం చేయాలి. లేకపోతే గత ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టిన ప్రజలే చరిత్ర హీనుల్ని చేసే రోజులు వస్తాయి.

సందర్భం



భారత రాజ్యాంగం మతపరమైన హక్కును, స్వాతంత్య్రాన్ని ఇచ్చింది. ఎవరు ఏ మతమైనా అవలంబించవచ్చు.

- నరేంద్ర దభోల్కర్,
సామాజిక కార్యకర్త

జననం: 1.11. 1945
మరణం: 20.8. 2013

ఉక్రెయిన్ సంక్షోభం: అలాస్కా సమావేశ ఆంతర్యం ఏమిటి?

అంతర్జాతీయం

ఎం. కోటేశ్వరరావు

అధికారానికి వచ్చిన 24 గంటల్లోనే ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరిస్తానని చెప్పిన డోనాల్డ్ ట్రంప్ గద్దెనెక్కి రెండు వందల రోజులు దాటింది. అడుగు ముందుకు పడకున్నా తాజాగా ఇదిగో పరిష్కారం అంటూ యావత్ ప్రపంచ దృష్టిని అటువైపు తిప్పాడు. తాజాగా అమెరికాలోని అలాస్కాలో గత శుక్రవారం నాడు జరిగిన ట్రంప్, పుతిన్ భేటీ వార్త సేకరణకు భారీ సంఖ్యలో వచ్చిన మీడియా సిబ్బందే దానికి నిదర్శనం.అంతకు ముందు వరకు కాల్పుల విరమణ, శాంతి ఒప్పందం ముందు జరగాలంటూ చెప్పిన పెద్దమనిషి అలస్కా సమావేశం తరువాత అలాంటివేమీ లేవు. ఏకంగా పరిష్కారానికి మరోసారి మాస్కోలో సమావేశమని ప్రకటించాడు. జెలెన్స్కీని ట్రంప్ ఎక్కడ బుట్టలో వేస్తాడో, తమతో నిమిత్తం లేకుండా ఒప్పందం కుదుర్చుకుంటారేమో అన్న భయం లేదా ముందు చూపుతో అనేకమంది ఐరోపా నేతలు కూడా కట్టగట్టుకు వచ్చి ట్రంప్‌తో చర్చలు జరిపారు. వారితో మాట్లాడుతూనే కాసేపు ఉండండి అన్నట్లు అంతరాయమిచ్చి పుతిన్‌తో ఫోన్లో మాట్లాడి తన ప్రాధాన్యత ఏమిటో వారికి అవగతమయ్యేట్లు చేశాడు. దానికనుగుణంగానే ఐరోపా నేతలు కూడా తమ మర్యాదను కాపాడుకుంటూ ట్రంప్ యత్నాలను హర్షిస్తూనే నర్మగర్భంగా తమ భిన్నాభిప్రాయాలను వెల్లడించారు. భద్రత అన్న తర్వాత మేం లేకుండా పుతిన్, జెలెన్స్కీ, ట్రంప్ ముగ్గురూ మాట్లాడుకుంటే సరిపోతుందా, నాలుగు పక్షాల సమావేశం జరగాలనే సందేశాన్ని వారు కూడా ఇచ్చారు. ఈ నెలాఖరులో సమావేశం ఎక్కడ జరగాలనే అంశంపై కసరత్తు ప్రారంభమైంది. అది కూడా గత సమావేశాల మాదిరే విఫలయత్నం అవుతుందా నిజంగానే రాజీ కుదిరేందుకు వేదిక అవుతుందా అన్నది పెద్ద ప్రశ్న.

అలాస్కా సమావేశం తర్వాత కొన్ని సరికొత్త కోణాలు వెలుగులోకి వచ్చాయి. చైనా, రష్యాల మధ్య ఉన్న బంధాన్ని తెంచేందుకు అమెరికా పూనుకుందన్నది వాటిలో ఒకటి.ఎక్కడో స్విచ్ వేస్తే మరెక్కడో లైటు వెలుగుతుందన్నట్లుగా దీనికి ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారం నాంది పలుకుతుందా! దీనర్థం వెంటనే ఏదో జరుగుతుందని కాదు గానీ మాజీ కమ్యూనిస్టు మహాప్రమాదకారి అన్నట్లుగా పుతిన్ తీరుతెన్నులను ఒక కంట కనిపెడుతూ ఉండాల్సిందే. వర్తమాన అంశానికి వస్తే మీడియాలో వస్తున్న లీకు వార్తలు, విశ్లేషణలను చూస్తుంటే మొదటి నుంచి రష్యా చెబుతున్నట్లుగానే దాని షరతులు, వైఖరికి అనుగుణంగానే ఒక పరిష్కారం కుదరవచ్చు అనే భావం కొందరిలో కలుగుతోంది. నిజంగా అలా జరిగితే ఐరోపాలో, ప్రపంచంలోనే సరికొత్త సమీకరణలు, పరిణామాలకు, మరింత పెద్ద సంక్షోభాలకు అది నాంది అవుతుంది. తాజా పరిణామాలు, విశ్లేషణలను చూసినపుడు మొత్తం మీద వ్లదిమిర్ పుతిన్ కూడా ఆశాభావంతోనే ఉన్నట్లు కనిపిస్తున్నదని పరిశీలకుల వ్యాఖ్య. ఇప్పటికే ఆర్థికంగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్న పుతిన్‌కు యుద్ధం దీర్ఘ కాలం కొనసాగితే రాజకీయ సమస్యలను ఎదుర్కొనే అవకాశాలు ఉంటాయి. అందువల్లనే అతనికీ పరిష్కారం అవసరం.

ట్రంప్ యంత్రాంగం రూపొందించినట్లు చెబుతున్న పరిష్కార పద్ధతి ప్రకారం ప్రస్తుతం రష్యా స్వాధీనంలో లేని కొన్ని ప్రాంతాలతో సహా డాన్‌బాస్ లో 6,600 చదరపు కిలోమీటర్లు లేదా పన్నెండు శాతం భూభాగాన్ని ఉక్రెయిన్ వదులుకోవాల్సి ఉంటుంది. దానికి ప్రతిగా సుమీ, ఖార్కివ్ ప్రాంతాలలో 440 చదరపు కిలోమీటర్లను రష్యా ఖాళీ చేసి ఉక్రెయిన్‌కు ఇస్తుంది. ఇదే జరిగితే రష్యాదే పైచేయి అవుతుంది. దాని షరతుల ప్రాతిపదికగానే ఒప్పందం ఉంటుంది. ఇంతవరకు ఏ ఒక్క అంశం మీద కూడా పుతిన్ దిగిరాలేదు.ఈ పూర్వరంగంలో అమెరికా ప్రతిపాదనలకు ఉక్రెయిన్ అంగీకరిస్తుందా, ఒకవేళ అమెరికా జెలెన్స్కీ మెడలు వంచి ఒప్పించినా ఐరోపా అగ్రదేశాలు తలూపుతాయా, చెప్పలేము. తెల్లవారే సరికి వైఖరులు, పరిణామాలు మారిపోతున్న ఈ రోజుల్లో రష్యా గడ్డమీద తలపెట్టిన తదుపరి భేటీ లోపల ఏమైనా జరగవచ్చు.మిలిటరీ దళాల రంగ ప్రవేశంతో సహా ఉక్రెయిన్‌కు ఐరోపా భద్రత కల్పించేందుకు పుతిన్ అంగీకరించవచ్చని ట్రంప్ యంత్రాంగం చెబుతోంది. దీని మీద పుతిన్ వైపు నుంచి ఇది రాస్తున్న సమయానికి ఎలాంటి ప్రతికూల లేదా అనుకూల స్పందనలు లేవు. ఒక వారంలోపే ఒప్పందం జరగాలని ట్రంప్ పట్టుబడుతుండగా అదెలా కుదురుతుంది, మంచి చెడ్డలు ఆలోచించటానికి కొన్ని వారాల వ్యవధి కావాలని ఐరోపా నేతలు చెబుతున్నారు.

పరిష్కారం కుదరాలంటే ముందుగా డాంటెస్క్, లుహానస్క్ ప్రాంతాల నుంచి ఉక్రెయిన్ మిలిటరీ వెనక్కు పోవటం తనకు ముఖ్యమని, అది చేస్తే మిలిటరీ చర్య నిలిపివేస్తానని శుక్రవారం నాటి చర్చలలో పుతిన్ స్పష్టం చేశాడట. జూన్ రెండవ తేదీన ఇస్తాంబుల్ సమావేశంలోనే దీన్ని రష్యా ప్రతినిధులు చెప్పారు.దీనితో పాటు క్రిమియా ద్వీపకల్పాన్ని రష్యా అంతర్భాగంగా గుర్తించటం, ఉక్రెయిన్ మిలిటరీ సంఖ్య తగ్గింపు, ఇతర ప్రాంతాల గురించి కూడా దానిలో పేర్కొన్నారు. రష్యన్లు మరీ ఎక్కువగా అడుగుతున్నారని, దాన్లో వారి స్వాధీనంలో లేని ప్రాంతాలు కూడా ఉన్నాయని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ వ్యాఖ్యానించటమే కాదు, ఉక్రెయిన్ కూడా అంగీకరించలేదు. గతంలో పేర్కొన్న నాలుగు ప్రాంతాల నుంచి ఉక్రెయిన్ మిలిటరీ ఉపసంహరణ బదులు రెండు ప్రాంతాల గురించి పుతిన్ పట్టుబట్టినట్లు వార్తలు. ఉక్రెయిన్ భద్రతకు హామీకి తాను అంగీకరిస్తానని, అయితే వివిధ దేశాలతో కూడిన అలాంటి వ్యవస్థలో తనకు వీటో అధికారం ఉండాలని రష్యా కోరింది.

తమతో భాగస్వామిగా చేసుకొని ప్రపంచ మార్కెట్లపై పెత్తనం చేయాలని జి7 కూటమి ఎనిమిదవ దేశంగా రష్యాను చేర్చుకున్న సంగతి తెలిసిందే. అయితే విబేధాలు తలెత్తి రష్యాను పక్కన పెట్టటం, ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వమిచ్చి మాస్కో ముంగిట ఆయుధ మోహరింపుకు పశ్చిమ దేశాలు కుట్ర పన్నిన తర్వాతే గతంలో తన ప్రాంతంగా ఉన్న క్రిమియా ద్వీపకల్పాన్ని రష్యా 2014లో విలీనం చేసుకుంది. సోవియట్ ఉనికిలో ఉన్న సమయంలో పాలనా సౌలభ్యం కోసం రష్యన్ రిపబ్లిక్ ప్రాంతమైన క్రిమియాను ఉక్రెయిన్‌లో కలిపారు. సోవియట్ పతనమైన తర్వాత రెండూ స్వతంత్ర దేశాలుగా మారినప్పటికీ 24 సంవత్సరాలు రష్యా వైపు నుంచి విలీనానికి ఎలాంటి ప్రయత్నాలు లేవన్నది గమనించాల్సిన అంశం. తమకు విశ్వసనీయమైన భద్రతా హామీ ఇవ్వాలని జెలెన్స్కీ పట్టుబడుతున్నాడు. ఇటీవలి కాలంలో అమెరికా వైఖరిలో వచ్చిన మార్పు ప్రకారం ఆయుధాలు ఎన్ని కావాలంటే అన్ని ఇస్తుంది, అవసరమైతే వైమానిక దాడులు జరుపు తుంది తప్ప తన మిలిటరీని కొత్తగా మరేదేశంలోనూ దించేందుకు సిద్ధం కావటం లేదు. అందువలన ఐరోపా దేశాలతో కలసి రక్షణ కల్పించేందుకు ట్రంప్ అంగీకరించే అంశాలు దాదాపు లేవనే చెప్పవచ్చు. తనకు వ్యతిరేకంగా పశ్చిమదేశాల కుట్రకు ఉక్రెయిన్ దూరంగా ఉంటే అన్ని రకాల భద్రత కల్పించేందుకు అసలు రష్యానే సిద్ధంగా ఉంటుందన్నది వేరే చెప్పనవసరం లేదు. రష్యాకు కొన్ని ప్రాంతాలను అప్పగిస్తే యుద్ధం ఆగిపోవచ్చుగానీ జెలెన్స్కీ కి పదవీ గండం పొంచి ఉంటుంది. మంత్రులు, ఉన్నతాధికారులు యుద్ధాన్ని అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా సంపాదించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్‌లో రష్యాకు ముప్పు తలెత్తకుండా చూసేందుకు ఇప్పటి వరకు ముందుకు తెచ్చిన ప్రతిపాదనలను సాధించకుండా ఒప్పందం చేసుకుంటే పుతిన్‌కూ అదే పునరావృతం అవుతుంది. ఇన్ని ప్రాణాలను బలిచ్చి ఆర్థికంగా నష్టం కలిగించటం ఎందుకన్న ప్రశ్నకు సమాధానం ఉండదు. రష్యాది పైచేయిగా మారితే ట్రంప్ కూడా ఇబ్బందుల్లో పడతాడు, వెంటనే ఎన్నికలు లేవు, వచ్చేసారి పోటీ చేస్తాడో లేదో తెలియదు గనుక వ్యక్తిగతంగా కలిగే నష్టం ఉండదు గానీ, ఐరోపాలో ఉన్న పలుకుబడిని అమెరికా కోల్పోవటం ఖాయం. దాని ప్రభావం మొత్తం ప్రపంచం మీదనే పడుతుంది.

> **గతంలో సోవియట్‌ను, గత మూడున్నర దశాబ్దాలుగా రష్యాను చూపి బెదిరించిన అమెరికా ఇప్పుడు ఆ రష్యాతోనే చేతులు కలిపి మరో రూపంలో ఐరోపాను అదుపులో ఉంచుకోవాలని చూస్తోందా అనే కోణాన్ని కూడా పరిశీలించాల్సి ఉంది. గతంలో సోవియట్, చైనా కమ్యూనిస్టు పార్టీల మధ్య తలెత్తిన సైద్ధాంతిక విబేధాలను ఉపయోగించుకొని లబ్ధి పొందేందుకు చూసింది. ఒకటి రాజకీయపరమైనది. రెండవది చైనా మార్కెట్లో ప్రవేశించి ఆర్థిక లబ్ధి. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటంటే రష్యా, చైనా నేడు మిత్ర దేశాలుగా ఉన్నాయి. ఇదే సమయంలో పుతిన్ కమ్యూనిస్టు కాదు, రష్యా సోషలిస్టు దేశం కాదు. ఈ రెండో అంశాన్ని ఉపయోగించుకొని మిత్రబేధంతో రష్యాను దగ్గరకు తీసుకోవాలని, దాని వనరులు, మార్కెట్‌లో లబ్ధి పొందాలని కొందరు అమెరికన్లు కోరుతున్నారు.**

విడివిడిగా అమెరికా ఆధిపత్యాన్ని ఎదుర్కోలేమన్న వాస్తవాన్ని గ్రహించిన ఐరోపా దేశాలు సమాఖ్య (ఇ.యు)గా ఏర్పడి, ఐక్యత మరియు పోరాటాన్ని కొనసాగిస్తున్నాయి. ఇతర దేశాల మీద పన్నుల దాడిని ప్రకటించినట్లే ట్రంప్ ఈ కూటమితో కూడా వ్యవహరించి వత్తిడి చేసి ఒక ఒప్పందానికి వచ్చాడు. మరోవైపున జర్మనీ వంటి దేశాలు భారీ ఎత్తున సైనికీకరణకు పూనుకున్నాయి. గతంలో సోవియట్‌ను, గత మూడున్నర దశాబ్దాలుగా రష్యాను చూపి బెదిరించిన అమెరికా ఇప్పుడు ఆ రష్యాతోనే చేతులు కలిపి మరో రూపంలో ఐరోపాను అదుపులో ఉంచుకోవాలని చూస్తోందా అనే కోణాన్ని కూడా పరిశీలించాల్సి ఉంది. గతంలో సోవియట్, చైనా కమ్యూనిస్టు పార్టీల మధ్య తలెత్తిన సైద్ధాంతిక విబేధాలను ఉపయోగించుకొని లబ్ధి పొందేందుకు చూసింది. ఒకటి రాజకీయ, రెండవది చైనా మార్కెట్లో ప్రవేశించి ఆర్థిక లబ్ధి. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటంటే రష్యా, చైనా నేడు మిత్ర దేశాలుగా ఉన్నాయి. ఇదే సమయంలో పుతిన్ కమ్యూనిస్టు కాదు, రష్యా సోషలిస్టు దేశం కాదు. ఈ రెండో అంశాన్ని ఉపయోగించుకొని మిత్రబేధంతో రష్యాను దగ్గరకు తీసుకోవాలని, దాని వనరులు, మార్కెట్‌లో లబ్ధి పొందాలని కొందరు అమెరికన్లు కోరుతున్నారు. ఇందుకు ఉక్రెయిన్ సంక్షోభం ఆటంకంగా ఉంది గనుక దాన్ని పరిష్కరించాలని వారు చెబుతున్నారు. ఈ పూర్వ రంగంలోనే ఎరగా ఉక్రెయిన్ ప్రాంతాన్ని రష్యాకు అప్పగించాలన్నది ట్రంప్ ఎత్తుగడ అంటున్నారు. అయితే అదే జరిగితే ఐరోపాలోని ధనికదేశాలు చైనాతో జట్టుకట్టే అవకాశాన్ని కూడా తోసిపుచ్చలేము. పెట్టుబడిదారులకు లాభాలు తప్ప శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు. పుతిన్ తక్షణ ఆలోచన యుద్ధం నుంచి బయటపడి తద్వారా ఆర్థిక ఆంక్షల బంధాలను బద్దలు కొట్టడం గనుక ఆ కోణంలో దాని మీద కేంద్రీకరించవచ్చు. అమెరికా మద్దతు లేకపోయినా ఐరోపా దేశాలు ఇచ్చే ధైర్యం, ఆయుధ సాయంతో నిలవగలమని ఉక్రెయిన్ భావిస్తే వెంటనే ఒప్పందానికి అంగీకరించక పోవచ్చు. లేకపోతే ముందే చెప్పుకున్నట్లు రష్యా షరతుల మీద రాజీకి రావచ్చు కూడా!

★

ఉపాధి కల్పన సాకుతో కార్పొరేట్లకు భూములు

విశ్లేషణ

జి. కోటేశ్వరరావు

టిడిపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు భూములు కేటాయించే క్రమంలో పాటించాల్సిన పద్ధతులు, ప్రమాణాలను పాటించడంలేదు. భూములు, ఇళ్లు, ఉపాధి కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు పరిహారం, పునరావాస కల్పనకు ఇవ్వాల్సిన ప్రాధాన్యతను విస్మరిస్తున్నది.

రెండు పంటలు పండించే కరేడు భూ సేకరణలో అయినా, అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండల సముద్రతీర గ్రామాల్లో విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వి.సి.ఐ.సి) నిమిత్తం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎ.పి.ఐ.ఐ.సి) సేకరించిన, ఇంకా సేకరిస్తున్న వేల ఎకరాల భూములైనా, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఐదో షెడ్యూల్‌లో వున్న చింతపల్లి మండలం ఎర్రవరం వద్ద షిర్డీ సాయి ఎలక్ట్రికల్ కంపెనీకి, అనంతగిరి మండలం పెదకోట, రైవాడ జలాశయం పైన అదానీకి చెందిన పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుకు అనుమతులైనా...ఉపాధి పేరుతో జరుగుతున్న మోసాలే. ఇవేవీ ప్రజల మేలుకోరి వచ్చిన ప్రాజెక్టులు, కంపెనీలు కాదు. పరవాడ మండలంలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ (జె.ఎన్.పి.సి), అచ్యుతాపురం సెజ్, బ్రాండెక్స్ ఇండియా అపెరల్ సిటీ (అధిష్టాన్)కి భూములు సేకరించిన కాలంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని నమ్మించి వేలాది ఎకరాల భూములను పేదలు, రైతుల నుంచి సేకరించి ప్రైవేటు కంపెనీలకు ప్రభుత్వాలు అప్పగించాయి.

తెలుగుదేశం, వైసిపి, ప్రస్తుతం తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ఏదొచ్చినా పారిశ్రామికాధిపతుల ప్రయోజనాల కోణం నుంచి చూస్తున్నాయి తప్పితే భూములిచ్చిన నిరాశ్రయుల జీవనోపాధిని పట్టించుకోవడంలేదు. పరిశ్రమల అధిపతులకు రాయితీలు, ఆర్థిక ప్రయోజనాలు కల్పించేందుకు తయారు చేసిన పారిశ్రామిక విధానంలో నిర్వాసితులు, వారి ఉపాధి ఊసే లేదు. కార్మిక చట్టాల అమలు, కనీస వేతనాల చెల్లింపు, పరిశ్రమల్లో రక్షణ, భద్రత వంటి అంశాలకు చోటే లేదు. కంపెనీల పేరుతో పారిశ్రామికవేత్తల నుంచి చివరకు విలువైన భూములను ఐ.టి కంపెనీలకు, షాపింగ్ మాల్స్‌కు కూటమి ప్రభుత్వం కేటాయిస్తోంది. భూములు సేకరించి కంపెనీలకు కేటాయించినంత వరకు ఉపాధిపై మాట్లాడిన ప్రభుత్వాలు, తరువాత వదిలేస్తున్నాయి. టెక్ హబ్‌ల కింద పెట్టుబడులు పెట్టే సంస్థలకు ఎకరా 99 పైసలకు కేటాయించాలని కూటమి ప్రభుత్వం ఇటీవల 'ఎ.పి.ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్ పాలసీ' తీసుకొచ్చింది. శ్రీలంకకు చెందిన బ్రాండిక్స్‌కు ఎకరా రూపాయి చొప్పున వెయ్యి ఎకరాలు కేటాయించినప్పుడు ఇటువంటి మాయమాటలే చెప్పింది. 60 వేల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పింది. ఇది జరిగి రెండు దశాబ్దాలవుతున్నా 22 వేల మందికి మించి బ్రాండిక్స్ యాజమాన్యం ఉపాధి కల్పించలేదు. వెయ్యి ఎకరాల్లో సగం కూడా వినియోగించలేదు. సెజ్ కింద ప్రభుత్వం నుంచి కోట్ల రూపాయల రాయితీలు పొంది, ఆ కాలపరిమితి పూర్తయ్యాక నాన్ సెజ్ కింద డినోటిఫై చేయించుకొని కేటాయించిన భూమిని ఇతర కంపెనీలకు సబ్ లీజులకు ఇచ్చి వ్యాపారం చేసుకోవాలని ప్రయత్నిస్తోంది. పరవాడ ఫార్మా సిటీ డెవలపర్ ర్యాంకీ యాజమాన్యం గ్రీన్‌బెల్ట్‌కు కేటాయించిన భూములను అమ్ముకొని కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంది. రాష్ట్రంలో ఏ సెజ్ చూసినా, పరిశ్రమలకు కేటాయించిన భూముల వినియోగం, ఉపాధి కల్పన పరిశీలించినా దాదాపు బ్రాండిక్స్ తరహాలోనే వుంటాయి.

> **రైతులకు పరిహారం పూర్తిగా చెల్లించకుండానే ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్‌కు భూమి కేటాయించింది. 1894 భూ సేకరణ చట్టం ప్రకారం 2010లో భూసేకరణ ప్రక్రియ ప్రారంభించింది. ప్రగతిశీలమైన 2013 భూ సేకరణ చట్టం అమలులోకి వచ్చిన తరువాత కూడా పాత 1894 చట్టం కింద పరిహారం చెల్లింపు ముమ్మాటికీ నిర్వాసితులకు అన్యాయం చేయడమే. పరిహారం చెల్లింపు, పునరావాస కల్పన జాప్యానికి ప్రభుత్వమే కారణం గనుక... భూ యజమానులకు, భూమిపై ఆధారపడి బతుకుతున్న పేదలు, వృత్తిదారులకు 2013 భూ సేకరణ చట్టం కింద హక్కులు, ప్రయోజనాలు కల్పించాలి. ఇకపై సేకరించే భూమికి తప్పనిసరిగా భూములు కోల్పోయిన వారి సమ్మతిని తీసుకోవాలి.**

ప్రజా ప్రయోజనం పేరుతో ప్రయివేటు కంపెనీల అవసరాలకు భూములు సేకరించి కేటాయించడం తప్ప నిర్వాసితులు, స్థానిక యువతకు కలిగే ప్రయోజనం శూన్యం. ప్రజలను నమ్మించడానికి ఉపాధి అనే పదాన్ని ప్రభుత్వాలు ఒక సాధనంగా వాడుకుంటున్నాయి. నక్కపల్లి ప్రాంతంలో 2010లో భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసినా ఇప్పటి వరకు పరిహారం, పునరావాసం ప్యాకేజీ కల్పించలేదు. సేకరించిన జిరాయితీ భూమి ఎకరాకు రూ.18 లక్షలు, డి పట్టా భూమికి రూ.12.60 లక్షలు, సాగుదారుకు రూ.6.30 లక్షలు చెల్లిస్తోంది. ఇప్పటికీ బల్క్ డ్రగ్ పార్కు పనులు జరుగుతున్న భూములకు చెందిన రైతులకు పూర్తి పరిహారం చెల్లించలేదు. చెట్లకు పరిపూర్ణంగా డబ్బులు జమ చేయలేదు. కొబ్బరి చెట్లకు ఐదు వేల చొప్పున చెల్లిస్తామని రూ.1500 లోపే చెల్లిస్తున్నారు. డి పట్టా భూముల్లోని చెట్లకు పరిహారమే చెల్లించలేదు. సాగుభూమి లోని పేదలకు ఏ పరిహారమూ చెల్లించకుండానే భూములు స్వాధీనం చేసుకుంది. ప్రైవేటు కంపెనీల ప్రయోజనాల కోసం బరితెగించి వ్యవహరిస్తున్న ప్రభుత్వం, భూములు, వృత్తులు కోల్పోయిన పేదలు, చేతివృత్తిదారులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, పునరావాసం, ప్యాకేజీ ఇవ్వడానికి ఇష్టపడ్డంలేదు. 1894 భూ సేకరణ చట్టం, సెక్షన్ 3, సబ్ సెక్షన్ ఎఫ్‌లో 'ప్రజా ప్రయోజనం' అన్న పదానికి స్పష్టమైన నిర్వచనం వుంది. ఈ చట్టం ప్రకారం భూ సేకరణ నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లు "ప్రజా ప్రయోజనం" అంటే, సేకరించిన భూమిని కేవలం ప్రభుత్వ రంగ సంస్థలకు మాత్రమే ఉపయోగించాలి తప్ప ప్రైవేటు సంస్థలకు బదలాయించకూడదు. ఇలా బదలాయించడం చట్ట విరుద్ధం. 2010లో అప్పటి ప్రభుత్వం, భూముల యజమానులకు 'ప్రజా ప్రయోజనం' కోసం భూమి సేకరిస్తున్నామని తెలిపి, 1894 చట్టం కింద భూ సేకరణ ప్రక్రియ చేపట్టింది. 1894 భూ సేకరణ చట్టం కింద సేకరించిన భూములను, ప్రైవేట్ కంపెనీ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ మిట్టల్‌కు 2,200 ఎకరాలు కేటాయించింది. చట్ట ప్రకారం భూమి బదలాయింపు చెల్లదు.

రైతులకు పరిహారం పూర్తిగా చెల్లించకుండానే ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్‌కు భూమి కేటాయించింది. 1894 భూ సేకరణ చట్టం ప్రకారం 2010లో భూసేకరణ ప్రక్రియ ప్రారంభించింది. ప్రగతిశీలమైన 2013 భూ సేకరణ చట్టం అమలులోకి వచ్చిన తరువాత కూడా పాత 1894 చట్టం కింద పరిహారం చెల్లింపు ముమ్మాటికీ నిర్వాసితులకు అన్యాయం చేయడమే. పరిహారం చెల్లింపు, పునరావాస కల్పన జాప్యానికి ప్రభుత్వమే కారణం గనుక... భూ యజమానులకు, భూమిపై ఆధారపడి బతుకుతున్న పేదలు, వృత్తిదారులకు 2013 భూ సేకరణ చట్టం కింద హక్కులు, ప్రయోజనాలు కల్పించాలి. ఇకపై సేకరించే భూమికి తప్పనిసరిగా భూములు కోల్పోయిన వారి సమ్మతిని తీసుకోవాలి. 2013 భూ సేకరణ చట్టం, 10వ సెక్షన్ ప్రకారం, వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు మళ్లిస్తే ఆ ప్రాంత ఆహార భద్రతపై ఎటువంటి ప్రభావం పడుతుందో పరిశీలించి వ్యవసాయ భూమికి సేకరణకు పరిమితి విధించాల్సి వుంది. కానీ ప్రభుత్వం చట్టపరమైన నిబంధనలు పట్టించుకోవడంలేదు.

జిరాయితీ భూములే కాకుండా, ప్రభుత్వ భూములను ప్రైవేట్ కంపెనీలకు బదలాయించకూడదని జగ్‌పాల్ సింగ్ వర్సెస్ పంజాబ్ ప్రభుత్వం కేసుకు సంబంధించి 2011 జనవరి 28న అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వాలన్నింటిని ఆదేశించింది. సుప్రీం తీర్పు ప్రకారం ప్రైవేటు ఆర్సెలార్ మిట్టల్‌కు భూమి కేటాయింపు చెల్లదు. నక్కపల్లి మండలంలో ఆర్సెలార్ మిట్టల్‌కు స్టీల్‌ప్లాంట్ కోసం భూములివ్వడమే కాకుండా, డి.ఎల్.పురం తీరంలో క్యాప్టివ్ పోర్టుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సముద్ర తీరం సంప్రదాయ మత్స్యకారుల, ప్రజల ప్రకృతి వనరు. ఆ వనరు విషయంలో ప్రజల తరపున ప్రభుత్వం ఒక ట్రస్టీ మాత్రమే. అంతే తప్ప ఆ వనరును ఏకపక్షంగా ప్రైవేటు కంపెనీకి ప్రభుత్వం బదలాయించడం చట్టవిరుద్ధం.

నక్కపల్లి తీరప్రాంతంలోని ఎనిమిది గ్రామాల్లో, 15 వేల మందికిపైగా సంప్రదాయ మత్స్యకారులు నివసిస్తున్నారు. వీరిలో అత్యధికులకు సముద్రంలో మత్స్య సంపద ప్రధాన జీవనాధారం. ఎ.పి.ఐ.ఐ.సి ఇచ్చే భూముల్లో ఏర్పాటుకానున్న పరిశ్రమలు విడుదల చేసే కాలుష్య, రసాయనాలతో సముద్రంలో మత్స్య సంపద తగ్గుతుంది. ఆ ప్రాంత ప్రజలు కాలుష్యానికి గురై అనారోగ్యం పాలవుతారు. నక్కపల్లిలో హెటిరో ఫార్మా కాలుష్యంతో మత్స్యకారుల ఉపాధి దెబ్బతిని బతుకు తెరువుకు వలసలు పోవాల్సిన దుస్థితిని చూస్తునే వున్నాం. ఉపాధి పోయే కుటుంబాలు బతకడానికి ప్రభుత్వం ప్రత్యేకమైన ఆర్థిక సహాయం చేయడంలేదు. పరిశ్రమల అభివృద్ధి పేరుతో పారిశ్రామికవేత్తలకు ఇష్టానుసారం భూములు కేటాయించడమే ప్రభుత్వ ఎజెండాగా ఉంది. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ను ప్రభుత్వం ప్రోత్సహించడంతో రెండు నష్టాలు వాటిల్లుతాయి. ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి దోహదం చేసిన, లక్షలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధిని కల్పిస్తున్న ప్రభుత్వ రంగ విశాఖ స్టీల్‌ప్లాంట్ దెబ్బతింటుంది. డి.ఎల్.పురం వద్ద ఆర్సెలార్ మిట్టల్‌కు ఇచ్చిన పోర్ట్ అనుమతులతో విశాఖ పోర్టుకు అపారమైన నష్టం వాటిల్లుతుంది. నిర్వాసితులు, ప్రజల మనోభావాలను దెబ్బ తీసి ప్రైవేటు కంపెనీల లబ్ధి కోసం రైతులు, పేదలు, మత్స్యకారులు, చేతివృత్తిదారులు, ప్రజల ప్రయోజనాలను ఫణంగా పెడుతున్న బిజెపి, టిడిపి డబుల్ ఇంజన్ సర్కార్ వేగానికి పోరాటాలతో బ్రేకులు వేయాలి. బల్క్ డ్రగ్ పార్కు పనులు, భూ సేకరణ, మిట్టల్‌కు భూమి కేటాయింపు వంటి చట్ట వ్యతిరేక చర్యలను అడ్డుకోవాలి.

/ వ్యాసకర్త సిపి(ఐ)ఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి,
సెల్: 9490300010 /

త్వరలో పుతిన్, జెలెన్‌స్కీ భేటీ !

● సన్నాహాలు జరుగుతున్నాయన్న ట్రంప్

వాషింగ్టన్ : రష్యా, ఉక్రెయిన్ అధ్యక్షులు పుతిన్, జెలెన్‌స్కీల భేటీకి చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం ప్రకటించారు. 'ఉక్రెయిన్, ఐరోపా నేతలతో సమావేశం అనంతరం పుతిన్‌తో మాట్లాడాను. పుతిన్, జెలెన్‌స్కీ మధ్య సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. సమావేశం జరిగే వేదికపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి వుందని ట్రంప్ సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు. వారి సమావేశం తర్వాత తాము ముగ్గురం కూర్చుని చర్చిస్తామని ట్రంప్ చెప్పారు. దాదాపు నాలుగు సంవత్సరాలుగా కొనసాగుతున్న యుద్ధానికి అంతిమంగా ముగింపు పలికేందుకు ఇది మంచి, ముందస్తు చర్య అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న యుద్ధానికి స్వస్తి చెప్పాలని పుతిన్ కూడా కోరుకుంటున్నారని, శాంతి స్థాపన కోసం ఆయన అన్ని పక్షాలతో కలిసి పనిచేస్తారని ట్రంప్ విలేకరులకు తెలిపారు. సమస్య పరిష్కారంలో పురోగతి కన్పిస్తోందన్నారు. అలాగే తమకు భద్రతా పరమైన హామీలు ఇవ్వాలని ఉక్రెయిన్ కోరుతోందని చెప్పారు.

ఒకే చిరునామాలో 24 ఓట్లు !

- తండ్రి కంటే కుమార్తె వయసే ఎక్కువ
- బయటపడుతున్న బీహార్ ఓటరు జాబితా 'సిత్రాలు'
- భారీ వర్షాలు, వరదలతో సంక్లిష్టంగా అక్రమాల పరిశీలన
- ముంచుకొస్తున్న గడువు

పాట్నా : బీహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) చేపట్టిన తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితా తప్పుల తడకగా కన్పిస్తోంది. ఒకచోట ఒకే చిరునామాలో 24 ఓట్లు ఉంటే, మరో చోట కుమార్తె వయసు కంటే తండ్రి వయసు తక్కువగా ఉంది. ముసాయిదా జాబితాలను పరిశీలిస్తుంటే ఇలాంటి 'సిత్రాలు' ఎన్నో కన్పిస్తున్నాయి.

ఒకే ఇంట్లో అన్ని కులాల వారా?

అర్రా పట్టణంలోని గౌసేగంజ్‌లో అర్రా శాసనసభ స్థానానికి చెందిన 103వ నెంబర్ పోలింగ్ కేంద్రం కోసం ముద్రించిన ఓటర్ల జాబితాను సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యకర్తలు పరిశీలించారు. ఓటరు జాబితా రూపకల్పనలో మోసాల్ని గుర్తించేందుకు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఖయాముద్దీన్ అన్సారీ నేతృత్వంలో బృందం అక్కడ పరిశీలన జరుపుతోంది.

ఆ జాబితాలోని ఇంటి నెంబర్ 10లో ఏకంగా 24 మంది ఓటర్ల పేర్లు వారికి కన్పించాయి. పైగా వారంతా ఒకే కులానికి చెందిన వారు కారు. వారిలో రాజపుత్రులు, బ్రాహ్మణులు, బనియాలు ఉన్నారు. ఒకే ఇంటిలో వివిధ కులాలకు చెందిన వారు నివసించడం ఎలా సాధ్యం? జాబితాలో కన్పించిన మరో వింత ఏమిటంటే ఒక చోట తండ్రి వయసును 28 సంవత్సరాలుగా, కుమార్తె వయసును 29 సంవత్సరాలుగా చూపారు.

బతికే ఉన్నామంటున్న బాధితులు

ఓటర్ల జాబితా నుంచి తమ పేర్లను తొలగించారంటూ వందలాది మంది సాక్ష్యాలతో సహా ఖయాముద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. ప్రతి ఇంటినీ సందర్శిస్తేనే చిరునామాల్లో అక్రమాలు బయటపడతాయని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) వ్యవస్థాపక సభ్యుడు జగదీప్ ఛోకర్ అభిప్రాయపడ్డారు. చిరునామాల పరిశీలన కోసం రాజకీయ పార్టీలపై ఆధారపడితే ప్రయోజనం ఉండదని ఆయన చెప్పారు. తొలగించిన ఓటర్ల జాబితాలను కేంద్ర ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో ఉంచినప్పటికీ ఎందుకు తొలగించాల్సి వచ్చిందీ తెలియజేయలేదు. కాబట్టి చనిపోయారని పేరు తొలగించారా, చిరునామాను శాశ్వతంగా మార్చినందుకు తొలగించారా లేక ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు ఉన్నందుకు తొలగించారా అన్నది తెలుసుకోవడం చాలా కష్టం. జీవించి ఉన్న ఓటర్లను కూడా చనిపోయినట్లు చూపి వారి పేర్లను జాబితా నుంచి తొలగించిన ఉదంతాలు కన్పిస్తున్నాయి. ఓటర్ల జాబితాలో చనిపోయినట్లు చూపిన మింటూ పాశ్వాన్ నేరుగా సుప్రీంకోర్టుకు వచ్చి తాను బతికే ఉన్నానని చెప్పుకోవాల్సిన పరిస్థితి.

సమస్యకు కారణాలు అనేకం

ప్రతి పోలింగ్ కేంద్రంలో 1,200 మంది కంటే ఎక్కువగా ఓటర్లు ఉండకూడదన్న నిబంధన కారణంగా వేరే బూత్‌లో ఓటు హక్కు కల్పించడం లేదా కొత్తగా బూత్‌ను ఏర్పాటు చేయడం వంటి ఉదంతాలు కూడా ఉన్నాయి. దీనివల్ల జాబితా పరిశీలన మరింత సంక్లిష్టంగా మారుతోంది. ఉదాహరణకు చనిపోయినట్లు చూపిన నలుగురు వ్యక్తులు జీవించే ఉన్నారని ఈ నెల 11న తేలింది. వారిలో ముగ్గురి పేర్లు మరో పోలింగ్ కేంద్రంలో ఉన్నాయి. ముసాయిదా ఓటర్ల జాబితా రూపకల్పనలో బ్లాక్ స్థాయి అధికారులకు పెద్దగా భాగస్వామ్యం కల్పించకపోవడం కూడా లోపాలకు కారణమైంది. అక్రమాలు కనిపెట్టడానికి ఇంకా రెండు వారాల సమయం మాత్రమే ఉంది. ఈ స్వల్ప సమయంలో ఎన్ని అక్రమాలు, అవకతవకలు వెలికితీయగలరు? పైగా భారీ వర్షాలు, వరదల కారణంగా ఓటర్ల పరిశీలన కష్టమవుతోంది. బీహార్‌లో దళితులు, ఇబిసిల ఓట్లు ఎక్కువగా తొలగింపునకు గురయ్యాయి. సామాన్యుల ఓట్లను తొలగించడాన్ని ఎడిఆర్ విమర్శించింది. గతంలో ప్రత్యర్థుల పోలింగ్ కేంద్రాలను స్వాధీనం చేసుకునే వారని, ఇప్పుడు ఆ పని పరోక్షంగా జరుగుతోందని ఆ సంస్థ పేర్కొంది.

విలువలను కొనసాగించండి : ట్రైనీ ఐఎఫ్ఎస్‌లతో రాష్ట్రపతి

న్యూఢిల్లీ : మన దేశపు శాంతి, భిన్నత్వం, అహింస విలువలను కొనసాగించాలని, నూతన ఆలోచనలు, విభిన్న సంస్కృతులు, ప్రపంచ దృక్పథాలను స్వాగతం పలకాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐఎఫ్ఎస్ అధికారులకు సూచించారు. ఇండియన్ ఫారెన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)కు చెందిన 2024 బ్యాచ్ ట్రైనీ అధికారులు మంగళవారం ఆమెను కలుసుకున్నారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో యువ అధికారులను రాష్ట్రపతి అభినందించారు. ప్రస్తుతం అత్యంత వేగంగా మారుతున్న ప్రపంచ మార్పులను రాష్ట్రపతి ప్రస్తావించారు. భౌగోళిక రాజకీయ మార్పులు, డిజిటల్ విప్లవాలు, వాతావరణ మార్పులు గమనిస్తూ ఉండాలని సూచించారు. ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో భారత్ నేడు ముఖ్యమైన భాగంగా ఉందని, ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, క్రమంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక శక్తిగా భారత్ గణనీయమైన ప్రాముఖ్యతను కలిగి ఉందని రాష్ట్రపతి తెలిపారు.

20 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం)

తిరుపతి జిల్లా కరకంబాడి-మామండూరు మార్గంలో అంజనేయపురం వద్ద వాహనాల తనిఖీల్లో 20 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకుని, ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ బృందం సోమవారం రాత్రి నుంచి మామండూరు రోడ్డు మార్గంలో వాహన తనిఖీలు చేపట్టారని అధికారులు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున రెండు కార్లు వేగంగా వస్తుండగా, అడ్డుపడ్డ అధికారులను చూసి, ఒక వాహనంలోని డ్రైవర్ పారిపోగా మరో వ్యక్తిని పట్టుకున్నారన్నారు. వాహనాలను తనిఖీ చేయగా అందులో 20 ఎర్రచందనం దుంగలు ఉన్నాయన్నారు. పట్టుబడిన స్మగ్లర్ కర్నాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. దీనిపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ లో ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారన్నారు.

నాటు సారా తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - కొమరాడ

రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరపకుండా జూన్ 24న కేంద్ర ఎన్నికల సంఘం బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను ప్రకటించడంతో అది ప్రారంభం నుంచే వివాదంలో చిక్కుకుంది. ఎందుకంటే జూన్ 24 తర్వాత ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదు. ఇది సంప్రదాయాలకు విరుద్ధం.

విస్తృత సవరణలు చేపట్టాలంటే ఓటర్ల జాబితా తయారీకి, సంప్రదింపులకు ఎక్కువ సమయం పడుతుంది. దేశంలోని ప్రతి పౌరుడికీ ఓటు హక్కును సార్వత్రికం చేయాలన్నది తొలి ఎన్నికల సంఘం నుంచీ సాధారణంగా అమలులో ఉన్న సూత్రం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326కి అనుగుణంగా ఓటర్ల జాబితాను రూపొందించే బాధ్యత ఎన్నికల సంఘానిదే. నిబంధనల ప్రకారం అభ్యంతరాలను పరిశీలించి, హోం మంత్రిత్వ శాఖను సంప్రదించి ఆ ప్రాతిపదిక పైనే పేర్లను తొలగించాల్సి ఉంటుంది. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరిగి, పదకొండు పత్రాలలో దేనితో అయినా రాతపూర్వకంగా దరఖాస్తును స్వీకరించాలని సర్ నిర్దేశించింది. ఈ పత్రాలలో చాలావరకూ బీహార్‌లో అందుబాటులో లేవు. నిర్దేశించిన పత్రాన్ని జత చేయకపోవడంతో చాలామంది ఓటు హక్కును కోల్పోయారు. ఓటర్లుగా నమోదు చేయని వారిని అసలు పౌరులుగానే గుర్తించకుండా వారి పేర్లను తొలగించే కసరత్తు జరిగింది. ఇలా చేయడం ఆర్టికల్ 326ను, సార్వత్రిక ఓటు హక్కు సూత్రాన్ని పూర్తిగా ఉల్లంఘించడమే అవుతుంది. ప్రతిపక్ష పార్టీలన్నీ సంఘటితంగా ఎన్నికల సంఘాన్ని కలిసినప్పటికీ ఓటు హక్కును మూకుమ్మడిగా రద్దు చేసే ప్రమాదాన్ని నివారిస్తామని అది ఎటువంటి హామీ ఇవ్వలేదు. అంటే ప్రతిపక్షాల అభ్యర్థనను తోసిపుచ్చిందన్న మాట.

ఇసి వైఖరి కారణంగా ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి ఓటు హక్కు రద్దు కాకుండా పౌరులను కాపాడేందుకు ముందుకు వచ్చాయి. సుదీర్ఘ చర్చల తర్వాత 'ఎస్ఐఆర్' సమయంలో తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల పేర్లను, తొలగించడానికి కారణాలను ప్రచురించాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. 'ఎస్ఐఆర్' ప్రక్రియను పారదర్శకంగా కొనసాగించడంలో ఇసి విఫలమైన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలు స్వాగతించదగినవి. చాలా మంది పరిశోధకులు వేలెత్తి చూపినట్లుగా మైనారిటీలు, మహిళలు, పేదలు ఎక్కువ సంఖ్యలో ఓటు హక్కు కోల్పోయారు. ఈ ప్రక్రియపై బీహార్‌లో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది. అన్ని ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా ఈ ప్రక్రియను వ్యతిరేకించాయి. ఆగస్ట్ 15న ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో ప్రధాని 'చొరబాటుదారుల' ప్రస్తావన తీసుకొచ్చారు. చొరబాటుదారుల ఏరివేతపై ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న ప్రచారాన్ని ఇసి పక్షపాత పూరితంగా అమలు చేస్తోంది. ప్రజలను సమీకరించి, వారిని చైతన్య పరచడం ద్వారా ఇసి వైఖరిని ఎండగట్టాల్సిన అవసరం ఉంది.

'ఎస్ఐఆర్'కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలు పార్లమెంటును, దేశ రాజధాని ఢిల్లీని కుదిపేశాయి. ఈ అంశంపై

జిఎస్‌టి సవరణ ప్రయోజనాలు వినియోగదారులకు అందాలి

దీపావళి రోజున జిఎస్‌టి రేట్లను తగ్గిస్తామని ప్రధాని ప్రకటించారు. ఈ తగ్గింపు ప్రయోజనాలు కార్పొరేట్లకు కాకుండా వినియోగదారులకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. దీనివల్ల ఆదాయాన్ని నష్టపోతే రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలి.

ఉప రాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి విజయం కోసం అన్ని పక్షాలతో సమన్వయం

జగదీప్ ధన్‌కర్ ఆకస్మిక రాజీనామా కారణంగా జరుగుతున్న ఉప రాష్ట్రపతి ఎన్నికపై పొలిట్‌బ్యూరో చర్చించింది. ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలిచిన జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి విజయం కోసం ఇతర ప్రతిపక్షాలతోనూ, ఇండియా వేదికతోనూ సిపిఐ (ఎం) సమన్వయం చేసుకుంటుంది.

తీసుకోవాల్సిన ఉమ్మడి వైఖరి గురించి చర్చించడానికి ఇండియా వేదిక చాలా కాలం తర్వాత సమావేశం కావడం సానుకూల పరిణామం. బీహార్‌లోని 25 జిల్లాల్లో 16 రోజుల పాటు 'ఓటర్ అధికార్ యాత్ర' చేపట్టాలని ఇండియా బ్లాక్ నిర్ణయించింది. ఈ యాత్ర సెప్టెంబర్ 1వ తేదీన పాట్నాలో జరిగే భారీ ప్రజా ర్యాలీతో ముగుస్తుంది.

లోక్‌సభ ఎన్నికల సమయంలో బెంగళూరు శాసనసభ నియోజకవర్గాలలోని ఒక దానిలో జరిగిన భారీ 'ఓట్ల దొంగతనం' సమస్యను పరిష్కరించడంలో స్వతంత్ర పాత్ర పోషించాల్సిన ఇసి విఫలమైనందున దాని పట్ల అనుమానాలు పెరుగుతున్నాయి. ఇసి సొంత రికార్డుల నుంచి సేకరించిన డాక్యుమెంటరీ ఆధారాలను ప్రతిపక్షాలు బయటపెట్టాయి. తనపై వచ్చిన ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం అపహాస్యం చేసింది. ఆధారాలను ప్రచారంలో ఉంచడానికి బదులుగా బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్న ఇసి పక్షపాత వైఖరికి ఇది అద్దం పడుతోంది.

భారత్‌పై సుంకాలపై...

భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాలు విధించింది. వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోలేకపోవడంతో ఇరవై ఐదు శాతం సుంకాలు, రష్యా నుంచి చమురు, గ్యాస్‌ను కొనుగోలు చేస్తున్నందుకు మరో ఇరవై ఐదు శాతం సుంకాలు వడ్డించింది. ఈ సుంకాల భారం వ్యవసాయం, మత్స్య రంగం, ఎంఎస్ఎంఇలు, ముఖ్యంగా వస్త్ర తయారీదారులపై తీవ్ర ప్రభావం చూపుతాయి. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేస్తే ద్రవ్యోల్బణం పెరుగుతుంది. ఎందుకంటే అధిక ధరల కారణంగా అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి.

రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులను తగ్గించుకొని, తన ఇంధన అవసరాల కోసం వాషింగ్టన్‌పై ఎక్కువగా ఆధారపడాలని అమెరికా కోరుకుంటోంది. భారత ప్రభుత్వం రాయితీలు పొందాలన్న ఆశతో అమెరికా విమానయాన సంస్థల నుంచి కొనుగోళ్లను గణనీయంగా పెంచుకుంటామని హామీ ఇచ్చింది. తద్వారా అమెరికాను శాంతింపచేయడానికి ప్రయత్నించింది. భారత ప్రభుత్వం ఎట్టి పరిస్థితులలోనూ అమెరికా ఒత్తిడికి లొంగకూడదు. దానికి బదులుగా ఇతర దేశాలతో సంబంధాలను పెంచుకునే విషయంపై దృష్టి సారించాలి.

పార్లమెంట్ సమావేశాలపై...

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో అన్ని ప్రతిపక్ష పార్టీలు 'ఎస్ఐఆర్' ప్రక్రియపై తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. బీహార్‌లో చేపట్టిన 'ఎస్ఐఆర్'పై చర్చకు అనుమతించడానికి ప్రభుత్వం నిరాకరించింది. ప్రతిపక్షాల నిరసనల మధ్య రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరించే క్రీడా బిల్లుతో సహా అనేక బిల్లులను కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టింది. గనులు-ఖనిజాల చట్టాలు, అణు బాధ్యత చట్టాన్ని సవరించేందుకు ఉద్దేశించిన బిల్లులను ప్రవేశపెట్టాలని చూస్తోంది. ఖనిజ అన్వేషణ, అణుశక్తి ఉత్పత్తి వంటి కీలక రంగాలలోకి ప్రైవేటు, విదేశీ పెట్టుబడులు ప్రవేశించేందుకు వీలుగా ఈ బిల్లులను ప్రవేశపెడుతున్నారు. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న ఈ బిల్లులను వ్యతిరేకించాలని అన్ని రాజకీయ పక్షాలను పొలిట్‌బ్యూరో కోరింది. కీలకమైన అంశాలపై చర్చకు అనుమతించకుండా ప్రభుత్వం మొండిగా నిరాకరించడం దాని నిరంకుశ స్వభావాన్ని చాటిచెబుతోంది. ప్రభుత్వ వైఖరి కారణంగా ప్రజలను ప్రభావితం చేసే పలు అంశాలపై పార్లమెంటులో చర్చ సాధ్యం కావడం లేదు.

జమ్ముకాశ్మీర్‌పై...

ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్ముకాశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించి ఐదు సంవత్సరాలు గడిచాయి. నిర్దేశించుకున్న లక్ష్యాలలో ఏ ఒక్కటీ నెరవేరలేదు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడంలో లేదా జమ్మూకాశ్మీర్ ప్రజలకు భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడి బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ తప్పుడు వాదనలను బయటపెట్టింది. ఆరు నెలల్లో రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తానంటూ ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయినందుకు కేంద్రాన్ని జవాబుదారీగా నిలపాల్సింది పోయి దాని కారణంగా రాష్ట్ర హోదా గురించి చర్చించడానికి ఇది సమయం కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడం దురదృష్టకరం. ఈ ఐదు సంవత్సరాల కాలంలో కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పాలనలో జమ్మూకాశ్మీర్ ప్రజల ప్రజాస్వామిక హక్కులను తుంగలో తొక్కారు. హామీ మేరకు అభివృద్ధి జరగకపోవడంతో జమ్మూ, కాశ్మీర్, లడఖ్... ఈ ప్రాంతాలన్నింటిలోనూ ప్రజల్లో అసంతృప్తి, కోపం పెల్లుబుకుతోంది. జమ్మూకాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించడంతోపాటు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలన్న డిమాండ్‌పై ప్రజలను సమీకరించాల్సిన అవసరం ఉంది.

మాలేగావ్ కేసులో అప్పీలుపై...

ఉగ్రవాద దాడులకు సంబంధించిన రెండు కోర్టు తీర్పులపై మహారాష్ట్ర ప్రభుత్వం భిన్నంగా వ్యవహరించింది. అవి ముంబయి రైలు పేలుళ్ల కేసు (2006)... మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసు. ముంబయి రైలు పేలుళ్ల కేసులో నిందితులు ఎక్కువగా ముస్లింలు. ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టులో అప్పీలు చేసి కోర్టు ఉత్తర్వుపై స్టే పొందింది. మాలేగావ్ పేలుళ్ల కేసులో దీనికి భిన్నంగా వ్యవహరించింది. హిందూత్వ తీవ్రవాదులు నిందితులుగా ఉన్న ఈ కేసులో న్యాయస్థానం వారిని నిర్దోషులుగా విడుదల చేస్తే దానిపై అప్పీలు చేయలేదు. ఇది మహారాష్ట్రలో బిజెపి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ మత పక్షపాతాన్ని బయటపెడుతోంది. మాలేగావ్ పేలుళ్ల కేసులో కోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీలు చేయాలని, నిందితులను సరిగా విచారించి దోషులుగా నిర్ధారించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేస్తోంది.

ఆరు వేలకుపైగా విద్యార్థుల వీసాల రద్దు

- అమెరికా విదేశాంగశాఖ వెల్లడి

వాషింగ్టన్ డిసి : సుమారు ఆరు వేలకుపైగా విద్యార్థుల వీసాలను అమెరికా విదేశాంగశాఖ రద్దు చేసినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. వలసచట్టం అమలు, జాతీయ భద్రతా ఇబ్బందులను తగ్గించడం వంటి ప్రయత్నాల్లో భాగంగా వీసా రద్దు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. తీవ్రమైన నేరాలు, ఉగ్రవాద సంబంధిత కార్యకలాపాలు సహా అమెరికా చట్టాలను ఉల్లంఘించడం, ఎక్కువకాలం దేశంలో ఉండటం వంటి కారణాలతో ఈ వీసాలను తిరస్కరించినట్లు సమాచారం. "స్టేట్ డిపార్ట్‌మెంట్ 6,000 కంటే ఎక్కువ మంది విద్యార్థుల వీసాలను రద్దు చేసిందన్న ఫాక్స్ న్యూస్ కథనాన్ని ధ్రువీకరిస్తున్నాం. వాటిలో అధిక భాగం దాడి, దోపిడీ, మద్యం లేదా మాదకద్రవ్యాలను వినియోగించి వాహనాలు నడపడం (డియుఐ), ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం వంటివి ఉన్నాయి" అని ఆ అధికారి చెప్పారు. రద్దైన వీసాల్లో మూడింట రెండొంతులు నేరాలకు సంబంధించినవని అన్నారు. వాటిలో సుమారు నాలుగు వేలు సందర్శకుల చట్టాన్ని ఉల్లంఘించాయని ఆ అధికారి తెలిపారు. ఉగ్రవాదం మరియు భద్రతా కారణాలకు సంబంధించిన ఇమ్మిగ్రేషన్, జాతీయ భద్రతా చట్టంలోని విభాగాన్ని ఉటంకిస్తూ.. 200 నుండి 300 మధ్య వీసాలు ఐఎన్ఎ 3బి కింద రద్దు చేసినట్లు తెలిపారు. వీసాలు రద్దు చేయబడిన విద్యార్థులు ఏ దేశాలకు చెందినవారు, వారు ఇప్పటికీ అమెరికాలోనే ఉన్నారా అన్న వివరాలను ఆ అధికారి వెల్లడించలేదు.

ఓట్ల చోరీపై సమాధానం ఇవ్వాల్సిందే

- ఇసి నిష్పక్షపాతంగా ఉండాలి
- పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. మంగళవారం పార్లమెంట్ ఆవరణలో మకర్ ద్వార్ వద్ద ఓట్ల చోరీ నిలిపివేయాలని, ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రతిపక్ష ఎంపిలు ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీ, ఎస్‌పి నేతలు అఖిలేష్ యాదవ్, రామ్‌గోపాల్ యాదవ్, టిఎంసి ఎంపి అభిషేక్ బెనర్జీ, డిఎంకె ఎంపిలు టిఆర్ బాలు, తిరుచ్చి శివ, కనిమొళి, ఎన్‌సిపి నేత సుప్రియా సూలే, సిపిఎం ఎంపిలు జాన్ బ్రిట్టాస్, అమ్రారామ్, రాధాకృష్ణన్, శివదాసన్, ఎస్.వెంకటేషన్, ఎఎ రహీమ్, సిపిఐ ఎంపి సంతోష్ కుమార్, ఆర్‌జెడి ఎంపి మనోజ్ కుమార్ ఝా, జెఎంఎం ఎంపి మహువా మాంఝీ, శివసేన ఎంపి అరవింద్ సావంత్ తదితరులు పాల్గొన్నారు.

ఖర్గే మాట్లాడుతూ ఓట్లను దొంగిలించి అధికారంలోకి వస్తే అది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని, రాజ్యాంగాన్ని హత్య చేయడమేనని అన్నారు. ప్రియాంక గాంధీ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఓట్ల దొంగతనం అంశంపై మాట్లాడాలని, దాని గురించి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీని ఎన్నికల కమిషన్ అడుగుతున్న అఫిడవిట్ పూర్తిగా అర్థంలేనిదని అన్నారు. '0' చిరునామాలో ఎందుకు చాలామంది ఉన్నారో, ఒకే చిరునామాలో ఇంతమంది ఎందుకు ఉన్నారో ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రతిపక్షాల ఆందోళన మధ్యే రెండు బిల్లులు ఆమోదం

బీహార్‌లో ఎస్ఐఆర్, ఓట్ల దొంగతనం అంశాలపై చర్చకు అంగీకరించని కేంద్రం మొండివైఖరిని నిరసిస్తూ... పార్లమెంట్ ఉభయ సభల్లోనూ ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. మంగళవారం లోక్‌సభను స్పీకర్ ఓంబిర్లా ప్రారంభిస్తూ ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించారు. ప్రతిపక్ష ఎంపిలు ప్లకార్డులు పట్టుకుని వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని, ఓటు చోరీ ఆపాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. సభను మళ్లీ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగడంతో సాయంత్రం నాలుగు గంటలకు వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే ఐఐఎం బిల్లును ఎటువంటి చర్చ లేకుండానే ఆమోదించిన తరువాత సభను బుధవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ అదే పరిస్థితి నెలకొంది. డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సభ్యులు అత్యవసర అంశాలను చర్చించాలని రూల్ 267 కింద ఇచ్చిన 20 నోటీసులను తిరస్కరించారు. అనంతరం జీరో అవర్ నిర్వహించేందుకు డిప్యూటీ చైర్మన్ ప్రయత్నించగా, ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. దీంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే గనులు, ఖనిజాల సవరణ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. అనంతరం సభను బుధవారానికి వాయిదా వేశారు.

ఎన్‌టిఆర్ స్ఫూర్తితో జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతివ్వండి

- తెలుగు రాష్ట్రాల్లోని పార్టీలకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన తెలుగు బిడ్డ రాజ్యాంగ, న్యాయకోవిదుడు జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఉపరాష్ట్రపతిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ఇండియా వేదిక ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రకటించడం తెలుగు ప్రజల గౌరవ ప్రతిష్టలను మరింత పెంచిందని పేర్కొన్నారు. మంగళవారం ఆయన జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ప్రపంచంతో పోటీపడేలా దేశ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దిన ప్రధాని పివి నర్సింహారావు తర్వాత తెలుగువారికి ఇలాంటి అవకాశం రావడం గొప్ప పరిణామమని రేవంత్ చెప్పారు. ప్రధానిగా పివి నరసింహారావుకు అవకాశం వచ్చినప్పుడు... సిద్ధాంతపరంగా ఎన్ని వైరుధ్యాలు ఉన్నప్పటికీ తెలుగువారికి దక్కిన గొప్ప అవకాశంగా భావించి ఆయనకు అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావు మద్దతు తెలిపి తన రాజకీయ విజ్ఞతను ప్రదర్శించారని కొనియాడారు. ఎన్‌టిఆర్ స్ఫూరితో ఇప్పుడు సుదర్శన్ రెడ్డి విజయానికి కెసిఆర్ (బిఆర్ఎస్), చంద్రబాబునాయుడు (టిడిపి), పవన్ కల్యాణ్ (జనసేన), వైఎస్ జగన్ (వైసిపి), అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం), వామపక్ష పార్టీలు సహకరించాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలుగు రాష్ట్రాల్లోని బిజెపి ఎంపిలు ఆత్మప్రబోధానుసారంగా ఓటేసి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దు చేయాలని చూస్తోన్న ప్రధాని మోడీ ప్రతినిధి సిపి.రాధాకృష్ణన్ అని విమర్శించారు. సుదర్శన్‌రెడ్డి గెలిస్తే రాజ్యాంగం రక్షించబడుతుందన్నారు.

అభిప్రాయమే ఇస్తాం, తీర్పు ఇవ్వం !

- రాష్ట్రపతి ప్రస్తావనపై స్పష్టం చేసిన సుప్రీం
- తమిళనాడు గవర్నర్ కేసులో తీర్పు కొట్టివేయలేమని వెల్లడి

న్యూఢిల్లీ : తమిళనాడు గవర్నర్ కేసు తీర్పుపై మళ్ళీ తీర్పు ఇచ్చే ఉద్దేశ్యం కానీ లేదా దాన్ని కొట్టివేసే ఆలోచన గానీ తమకు లేదని ఈ కేసుకు సంబంధించిన రాష్ట్రపతి ప్రస్తావనను విచారిస్తున్న ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 143వ అధికరణ కింద రాష్ట్రపతి తన ప్రస్తావనలో లేవనెత్తిన ప్రశ్నలపై అభిప్రాయాలు మాత్రమే చెబుతామని, అంతవరకే తమ పరిధి పరిమితమైందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ అన్నారు. నిర్దిష్ట కాలపరిమితిలోగా బిల్లులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోతే గవర్నర్లకు, రాష్ట్రపతికి కాలపరిమితి విధించే అధికారాలు న్యాయస్థానానికి వున్నాయా అని రాష్ట్రపతి ప్రశ్నించారు. దానిపై విచారణ జరుపుతున్న ధర్మాసనం, 2020 నుండి బిల్లులను తన వద్దనే అట్టిపెట్టుకుని తమిళనాడు గవర్నర్ సృష్టించిన అధ్వాన్నమైన పరిస్థితిని పరిష్కరించేందుకే తాము రంగంలోకి దిగినట్లుగా తెలిపింది. గవర్నర్‌కు వ్యతిరేకంగా తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన కేసుపై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు రాష్ట్రపతి, గవర్నర్లకు ఈ మూడు మాసాల కాలపరిమితి విధిస్తున్నట్లు తీర్పు చెప్పింది. ఆ తర్వాత నెల రోజులకే రాష్ట్రపతి, న్యాయస్థానానికి తన ప్రశ్నలు సంధించారు. రాష్ట్రపతి ప్రస్తావనలో లేవనెత్తిన ప్రశ్నలపై అభిప్రాయాలు మాత్రమే వెల్లడించగలమని, అంతేకానీ తీర్పుచెప్పలేమని చీఫ్ జస్టిస్ గవాయ్ కేంద్రాన్ని, అటార్నీ జనరల్ వెంకటరమణిని ఉద్దేశిస్తూ చెప్పారు. తే తమిళనాడు ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాదులు ఎ.ఎం.సింఘ్వి, పి.విల్సన్, కె.కె.వేణుగోపాల్, కేరళ ప్రభుత్వం తరపున సి.కె.శశిలు మాట్లాడుతూ, రాష్ట్రపతి ప్రస్తావన విచారణా అర్హమైనదే అనడంపై అభ్యంతరాలు లేవనెత్తారు. తమిళనాడు గవర్నర్ కేసులో ఇచ్చిన తీర్పుకు రాజ్యాంగంలోని 141వ అధికరణ కింద అందరూ కట్టుబడి వుండాల్సిందేనని వాదించారు. దానిపై బెంచ్ తీవ్రంగా స్పందించింది. రాష్ట్రపతికి, గవర్నర్లకు కాలపరిమితులు విధించే అధికారాలు న్యాయస్థానానికి వున్నాయా లేదా అని స్వయంగా రాష్ట్రపతి ప్రశ్నించారు. ఈ విషయమై స్వయంగా అభిప్రాయాలు తెలుసుకోగోరితే మీకేమిటి అభ్యంతరమని బెంచ్ తమిళనాడు, కేరళ రాష్ట్రాలను ప్రశ్నించింది.

సంబంధాల బలోపేతంతో సుదీర్ఘకాల ప్రయోజనాలు

- చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఇ
- ఇరు దేశాల సంబంధాల్లో కొత్త ఊపు : అజిత్ దోవల్

న్యూఢిల్లీ : చైనా, భారత్‌ల మధ్య సంబంధాలు ఆరోగ్యంగా,సుస్థిరంగా వుంటే ఇరు దేశాల సుదీర్ఘకాల ప్రయోజనాలకు మంచిదని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి అన్నారు. ఇదే అంశాన్ని చరిత్ర, వాస్తవ పరిస్థితులు మనకు మరోసారి నిరూపించాయని వాంగ్ పేర్కొన్నారు. అన్ని వర్ధమాన దేశాలు కోరుకునేది కూడా ఇదేనని అన్నారు. ప్రస్తుతం భారత దేశంలో పర్యటిస్తున్న వాంగ్ యి 24వ ప్రత్యేక ప్రతినిధుల చర్చలను ప్రారంభిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఎదురుదెబ్బలతో నష్టమే జరిగిందని అన్నారు. సరిహద్దు సమస్యపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, చైనా సంబంధాల్లో కొత్త శక్తి, ఊపు నెలకొన్నాయని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పేర్కొన్నారు. సరిహద్దు పొడవునా శాంతి కూడా నెలకొందన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు కూడా ఇప్పుడు మరింత స్థిరంగా వున్నాయన్నారు. త్వరలో జరగబోయే షాంఘై సహకార సదస్సు (ఎస్‌సిఒ)కు హాజరయ్యేందుకు ప్రధాని నరేంద్ర మోడీ చైనా వెళతారని తెలిపారు. మోడీ చైనా పర్యటనపై ఇదే తొలి అధికారిక ప్రకటన. ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో తియాన్‌జిన్ నగరంలో ఎస్‌సిఓ సదస్సు జరగనుంది. ఈ నేపథ్యంలో ఈనాటి చర్చలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయని దోవల్ వ్యాఖ్యానించారు.

వాస్తవాధీనరేఖ పొడవునా పరిస్థితులను సమీక్షించడంతో పాటూ విశ్వాస పునరుద్ధరణ కోసం కొత్తగా తీసుకోబోయే చర్యలను కూడా ఇరువురు నేతలు ఈ సమావేశంలో చర్చిస్తున్నారు.

భారత్, చైనాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఇప్పుడు ముఖ్యమైన అవకాశాలను ఎదుర్కొంటున్నాయని వాంగ్ వ్యాఖ్యానించారు. 2020లో జరిగిన గల్వాన్ ఘర్షణల ప్రతికూల ప్రభావం గురించి వాంగ్ పరోక్షంగా ప్రస్తావించారు. గతంలో తగిలిన ఎదురుదెబ్బలతో ఇరు దేశాల ప్రయోజనాలు ముందుకు సాగలేదని అంగీకరించారు.

మహారాష్ట్రలో కుంభవృష్టి

- ముంబయిలో 30 సెంటీమీటర్ల వర్షపాతం
- నాందేడ్‌లో 8 మంది మృతి
- మోనోరైలులో ఉన్న 442 మందిని రక్షించిన ఎన్‌డిఆర్‌ఎఫ్

ముంబయి : భారీ వర్షాలు, వరదలతో మహారాష్ట్ర అతలాకుతలమవుతోంది. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. నాందేడ్ జిల్లాలో క్లౌడ్‌బరస్ట్ వంటి పరిస్థితి తలెత్తడంతో వరదలు సంభవించి ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. ముంబయి నగరంలో అత్యధికంగా 30 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముంబైలోని మైసూర్ కాలనీ, భక్తిపార్క్ స్టేషన్ల మధ్య విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మోనో రైలు నిలిచిపోయింది. ఆ రైలులో చిక్కుకుపోయిన 442 మందిని ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు రక్షించాయి. రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల మోనో రైలు ఆగిపోయిందని ఎంఎంఆర్‌డిఎ వెల్లడించింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మంగళవారం విపత్తు నిర్వహణ విభాగం అధికారులతో వరద పరిస్థితిని సమీక్షించారు. ముంబయి, థానే, రాయగడ్, రత్నగిరి, సింధుదుర్గ్ జిల్లాలకు రానున్న 48 గంటలు ఎంతో కీలకమని, అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో 14 లక్షల హెక్టార్ల పంట పొలాలు నీటిలో మునిగిపోయాయని చెప్పారు. బుధవారం వరకూ అత్యంత భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ముంబయి, మధ్య మహారాష్ట్రలోని కొండ ప్రాంతాలు సహా కొంకణ్‌కు ఐఎండి రెడ్ అలర్ట్ జారీ చేసింది.

మిథి నదిలో నీటి ప్రవాహం పెరుగుతున్నందున ముంబయిలో పరిస్థితిని బృహన్ ముంబయి కార్పొరేషన్ (బీఎంసీ) ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ చెప్పారు. నదీ ప్రవాహం ప్రమాద స్థాయికి చేరుకోవడంతో వందలాది మందిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భారీ వర్షాల కారణంగా రైలు పట్టాలు నీట మునగడంతో పలు స్థానిక రైలు సర్వీసులు రద్దయ్యాయి. చూనాబట్టీ రైల్వే స్టేషన్ పూర్తిగా నీట మునిగింది. విమానాశ్రయానికి దారితీసే అనేక మార్గాలు వరద నీటిలో మునిగిపోవడంతో ప్రయాణికులకు ఇండిగో ఎయిర్‌లైన్స్ అడ్వైజరీ జారీ చేసింది. విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కొన్ని విమానాలను దారి మళ్లించారు. రెడ్ అలర్ట్ జారీ అయిన జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలు మూసివేశారు. వరద ప్రాంతాల్లో ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బందిని మోహరించారు.

పలు జిల్లాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని ఐఎండి హెచ్చరికలు జారీ చేసింది. పాల్ఘర్ ప్రాంతంలో అనేక ఇళ్లు నీట మునిగాయి. ములా నదీ పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి హెచ్చరికలు జారీ చేశారు. ముల్షి డ్యామ్ నుంచి నీటిని కిందికి వదులుతుండడంతో ములా నదిలో ప్రవాహం పెరిగింది.

మరఠ్వాడా ప్రాంతంలో వందలాది గ్రామాలు నీటిలో మునిగిపోయాయి. అక్కడ 2.8 లక్షల హెక్టార్ల పంట దెబ్బతిన్నదని, 200కు పైగా పశువులు మృత్యువాత పడ్డాయని అధికారులు తెలిపారు. కుందలిక, సవిత్ర నదుల్లో నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరింది. కుండపురకం డ్యామ్ నుంచి 11,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో రాధానగరి జిల్లాలోని అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. కోల్హాపూర్-రైతన గమే అమ్మడ ప్రాంతంలో భూమి కంపించింది. దీంతో రహదారుల్ని మూసివేశారు. బాంబే హైకోర్టు కొద్ది సమయం మాత్రమే పనిచేసింది.

బొలీవియాలో మితవాద పక్షాలకే మొగ్గు

సుక్రి : దాదాపు రెండు దశాబ్దాల పాటు వామపక్ష పార్టీ అయిన మూవ్‌మెంట్ టూవర్డ్ సోషలిజం (ఎంఎఎస్) పాలన సాగించిన అనంతరం ఈసారి ఎన్నికల్లో బొలీవియా ప్రజలు మితవాద పక్షం వైపు మొగ్గు చూపారు. బొలీవియాలో ఈ నెల 17న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇప్పటికి 95.41శాతం ఓట్లు లెక్కించారు.

ప్రాథమిక ఫలితాల ప్రకారం, క్రిస్టియన్ డెమోక్రటిక్ పార్టీ (పిడిసి)కి చెందిన రొడ్రిగో పాజ్, ఫ్రీ అలయన్స్ (ఎఎల్)కి చెందిన మాజీ అధ్యక్షుడు జార్జి క్విరోగాలు విజేతలుగా నిలిచారు. పాజ్‌కు 32శాతం ఓట్లు రాగా, క్విరోగాకు దాదాపు 27శాతం ఓట్లు లభించాయి. ఈ రెండు మితవాద పార్టీలు అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నాయి. సంపూర్ణ మెజారిటీలు రానప్పటికీ కాంగ్రెస్, సెనెట్‌లపై రెండు మితవాద పార్టీలకు నియంత్రణ వుంటుంది. రెండో దశ ఎన్నికలు అక్టోబరు 19న జరగాల్సి వున్నాయి. ఆ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో దాన్నిబట్టి బొలీవియా దిశా నిర్దేశం నిర్ణయమవుతుంది. ప్రస్తుత అధ్యక్షుడు లూయిస్ ఆర్స్ దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ శాంతియుతంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ ఫలితాలు ఆర్స్‌కు పెద్ద ఎదురుదెబ్బగా నిలిచాయి. ఈ ఎన్నికల్లో ఎంఎఎస్ ఆరో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

సిద్ధార్థ వరదరాజన్, కరణ్ థాపర్ పై అస్సాంలో దేశద్రోహం కేసు

(మొదటి పేజీ తరువాయి)

అంకుర్ జైన్‌ను ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంప్రదించగా, వారు ఏ ఫిర్యాదుల ప్రాతిపదికన ఎఫ్ఐఆర్ నమోదు చేశారో ఆ వివరాలు వెల్లడించలేదు.

సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాం : వరదరాజన్

సోమవారం రాత్రి సుప్రీంకోర్టు ముందు పిటిషన్ దాఖలు చేసినట్లు వరదరాజన్ చెప్పారు. స్పీడ్ పోస్ట్, వాట్సాప్‌ల ద్వారా సమన్లు జారీ చేసిన ఇన్‌స్పెక్టర్‌కు సమాధానాలు ఇచ్చామని తెలిపారు. తనకు జారీ చేసిన సమన్లు చట్టప్రకారం సరికాదని, ఎందుకంటే అందులో ఎఫ్ఐఆర్ కాపీ జతపరిచి లేదని చెప్పారు. తమపై వారు చేసిన అభియోగాలేమిటో కూడా వివరాలు లేవన్నారు. ఎఫ్ఐఆర్ తేదీ కూడా లేదన్నారు. గత ఎఫ్ఐఆర్‌పై ఇప్పటికే సుప్రీం కోర్టును ఆశ్రయించిన విషయాన్ని ఆ ఇన్‌స్పెక్టర్‌కు గుర్తు చేశామని వరదరాజన్ చెప్పారు. ముందుగా తమకు ఎఫ్ఐఆర్ కాపీని అందచేయాలని తాము రాతపూర్వకంగా లేఖలో ఇనస్పెక్టర్‌ను కోరినట్లు వరదరాజన్ చెప్పారు. చట్ట ప్రకారం దర్యాప్తునకు సహకరిస్తామని, ఎఫ్ఐఆర్ కాపీని అందజేసినట్లైతే వర్చువల్‌గా లేదా ఢిల్లీలోనైనా తనను ప్రశ్నించవచ్చని ఆ లేఖలో వరదరాజన్ పేర్కొన్నారు.

జీవన సౌరభం

విజయం కోసం చేసే ప్రతి ప్రయత్నమూ సఫలం కాకపోవచ్చు. కానీ ప్రయత్నమే చేయకపోతే ఏ ఫలితమూ రాదు.

మీ కోసం

వర్షాకాలం ఉప్పు, పసుపు, కారం పొడిలో తేమ రాకుండా ఉండాలంటే అందులో కాసిన్ని బియ్యం గింజలు వేయాలి.

స్వేచ్ఛ

అనగనగా ఒక అడవి. అడవిలో ఒక తల్లి ఉడుత ఉండేది. దానికి రెండు పిల్లలు ఉన్నాయి. ఒక రోజు అవి వాళ్ల అమ్మ దగ్గరికి వెళ్లి, 'అమ్మా.. ఆకలిగా ఉంది. మాకు పల్లీలు కావాలి' అన్నాయి. 'ఆహారం అంటే.. ఏదో ఒకటి తీసుకొస్తాను. కానీ పల్లీలే కావాలంటే పక్కన రాజు గారి తోటలో ఉంటాయి' అని తల్లి చెప్పింది. 'మాకు ఆ పల్లీలే కావాలి' అని మారాం చేశాయి పిల్లలు. చేసేదేమీ లేక తల్లి అడవిని దాటి కోటలో ఉన్న తోటకి చేరింది.

ఆ తోటలో పల్లీలను తీసుకొస్తుండగా రాజకుమారుడు చూశాడు. వెంటనే ఉడుతను పట్టుకొని తల్లి దగ్గరికి తీసుకెళ్లాడు. 'అమ్మా ఇది మన తోటలో పల్లీలను తినేస్తుంది. అందుకే ఇక్కడికి తీసుకొచ్చాను' అని తల్లికి చెప్పాడు.

'ఉడుతను పంజరంలో పెట్టి ఇక్కడే పెంచుకుంటాను. నాకు చాలా బాగా నచ్చింది' అన్నాడు రాజకుమారుడు. 'నాన్నా.. ఇలా పక్షులను, జంతువులను బంధించడం చాలా తప్పు. అవి ఇక్కడ ఉండటం కన్నా, అడవుల్లో స్వేచ్ఛగా తిరుగుతూ ఉంటేనే వాటికి హాయిగా ఉంటుంది. కాబట్టి ఆ ఉడుతను వదిలేయి. ఇక పల్లీలు అంటావా! ప్రతి ప్రాణి ఏదో ఒకటి తిని జీవితాన్ని కొనసాగిస్తాయి. అందుకే ఆ ఉడుత ఆహారం కోసం ఇక్కడికి వచ్చి ఉంటుంది' అని చెప్పింది తల్లి. ఆ మాటలు విన్న రాకుమారుడు ఉడుతను తోటలో వదిలేసాడు. ఆహారం తీసుకొని పిల్లల వద్దకు బయలుదేరింది. పల్లీలను చూడగానే ఉడుత పిల్లలు ఎగిరి గంతులు వేశాయి.

– షేక్ ఆమీనా,
6వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్ కోదాడ,
సూర్యాపేట.



చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన చుక్కలను వరుసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి మరి!

నేను గీసిన బొమ్మ



షేక్ బషీర్,
3వ తరగతి,
ఎంపియుపి స్కూల్,
పి.నైనవరం,
ఎన్టీఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వరదలు... అప్రమత్తమే మేలు

రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరో 48 గంటలపాటు వర్షాలు కురుస్తాయని విశాఖపట్టణంలోని వాతావరణ శాఖ ఆదేశాల మేరకు ఎపి విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అల్పపీడన ప్రభావంతో గత మూడురోజులుగా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతున్న విషయం తెలిసిందే. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నదులు, చెరువులు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాలతోపాటుగా పట్టణాలు, నగర పంచాయతీల పరిధిలోని మురికివాడలు, లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. మురుగునీరు పొంగిపొర్లుతుండటంతో తాగే మంచినీరు కలుషితమయ్యే ప్రమాదం పొంచివుంది. ఈ క్రమంలో రోజువారీ కార్యక్రమాలను నిర్వహించుకోవటానికి ప్రతిఒక్కరూ ఇంటి నుంచి బయటకు వెళ్లటం తప్పదు. ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా వర్షంలో బయటకు వెళ్లినా తడవకుండా ఉంటారు.

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కాలువలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. కృష్ణా, గోదావరి నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రజలు అన్ని విధాలా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

వ్యాధుల పట్ల అప్రమత్తం

వర్షాలు కురిసే సమయంలో ఎక్కువగా తడిస్తే అనారోగ్య సమస్యలు దాపురించే ప్రమాదం ఉంది. కొన్ని చిన్న జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి రోగం మనల్ని దరిచేరకుండా ఉంటుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. వర్షాల సమయంలో వైరల్ ఇన్ఫెక్షన్లను అరికట్టడంలో సహాయపడే కొన్ని జాగ్రత్తలు ఇవే...

- ఎక్కువగా వర్షంలో తడవకుండా ఉంటే చాలా వరకూ కొన్ని రకాల వ్యాధుల నుంచి బయటపడొచ్చు.
- జలుబు, దగ్గు, చిన్నపాటి జ్వరం వస్తూ ఉంటాయి. ఇలాంటప్పుడు కాచి చల్లార్చిన నీటిని తాగుతూ ఉండాలి. ఎలాంటి పరిస్థితుల్లో మంచినీటిని డైరెక్ట్‌గా తీసుకోవడం మంచిది కాదు.
- వంట చేయడానికి ముందు కూరగాయలు, తినే ముందు పండ్లను బాగా కడగాలి. దుమ్ము, ధూళి, హానికరమైన బ్యాక్టీరియాకు ఇవి గురవుతూ వైరల్ ఇన్ఫెక్షన్‌లను కల్గిస్తాయి.
- వేడివేడి ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. నిల్వవుంచిన ఆహార పదార్థాలను తింటే ఇన్‌ఫెక్షన్ వచ్చి రోగ నిరోధక శక్తి తగ్గే అవకాశం ఉంటుంది. .
- బయట ఆహారాన్ని తినటం మానేయాలి. కట్ చేసిన పండ్లను వెంటనే తినేయాలి.
- నీరు నిల్వవుండకుండా మీ చుట్టూ ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి. కొంతవరకు వైరల్ ఇన్ఫెక్షన్లను నివారించొచ్చు.
- భోజనానికి ముందు, తర్వాత వేడి నీళ్లతో చేతులు కడుక్కోండి
- దగ్గు, జలుబుతో బాధపడుతుంటే మీ ఆహారం, పానీయాలను ఎవరితోనూ పంచుకోవద్దు
- వ్యాధి సోకిన వ్యక్తి నుంచి ఆరోగ్యకరమైన వ్యక్తిగా మారడానికి కొన్ని సూక్ష్మక్రిములు మాత్రమే అవసరం.
- శీతల పానీయాలు తీసుకోవడం మంచిది కాదు.
- రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారాలను తీసుకోవాలి.

ఇవి పాటించండి

- ప్రయాణాలను వాయిదా వేసుకోవడం ఉత్తమం
- వరద ప్రవాహాన్ని దాటేందుకు ప్రయత్నించరాదు
- వర్షం వస్తున్నప్పుడు చెట్ల కింద ఉండరాదు
- వర్షంలో తడవడం, చిన్నపిల్లలు వర్షంలో ఆడకుండా చూసుకోవాలి
- విద్యుత్ స్థంభాలు, నియంత్రికలు, వైర్లు, మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలి.
- తడిచిన విద్యుత్ స్తంభాల సపోర్ట్‌వైర్, విద్యుత్ ఉపకరణాలను తాకరాదు
- బట్టలు ఆరేసుకునే తీగకు విద్యుత్‌వైర్లు కలపరాదు.
- ట్రాన్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తే వెంటనే విద్యుత్‌శాఖకు తెలియజేయాలి.
- వర్షాలు పడుతున్న సమయంలో విద్యుత్ మోటార్లు ఆన్ చేయరాదు.
- గృహాల్లో అతుకులు లేని సర్వీసు వైర్లు మాత్రమే ఉపయోగించాలి.
- తెగిపడిన, వేలాడుతున్న తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకరాదు.
- విద్యుత్ మరమ్మతుల కోసం సంబంధిత సిబ్బందికి సమాచారం అందించాలి.
- విద్యుత్‌షాక్‌కు గురైన వ్యక్తిని ముట్టుకోవద్దు. వ్యవసాయ పంపుసెట్లను, స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయాలి.
- విద్యుత్‌శాఖ సిబ్బందిని సంప్రదించి వారి సేవలను పొందాలి.

తీర ప్రాంతాల్లో మరింత అప్రమత్తం

రాష్ట్రంలోని నదీ, సముద్ర తీరాల్లోని ప్రజానీకం మరింత అప్రమత్తంగా ఉండాలి. వరద ఉధృతి గురించి వాతావరణ శాఖ సూచించే హెచ్చరికలను అమలు చేయాలి.

- ఆకస్మిక వరద గురించి తెలుసుకోండి
- ముంపు ప్రాంతాల్లోకి ప్రవేశించొద్దు
- మీ ఇంటి డ్రెయినేజీ వ్యవస్థను శుభ్రంగా ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉంచండి
- ఎలక్ట్రికల్ గాడ్జెట్లు, మెషినరీని అన్‌ప్లగ్ చేయండి..నీటికి దూరంగా ఉంచండి
- తగినంత ఆహారం,త్రాగునీరు నిల్వ చేయండి

సున్నా నుండి స్టార్ వరకు ...

సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న ఎన్నో వీడియోల్లో ముంబయికి చెందిన వర్ష సోలంకి డ్యాన్స్ వీడియోలు కూడా ఉంటాయి. ఆ వీడియోలన్నీ ఔరా అనేలా ఉంటాయి. ఎంతో ప్రతిభ ఉన్న కళాకారిణిలా ఆమె వేసే స్టెప్పులకు తన ఫాలోవర్స్ లైక్‌ల మీద లైక్‌ల కొడుతుంటారు. అయితే వర్ష శిక్షణ పొందిన కళాకారిణి కాదు.. ఒక బిడ్డకి తల్లి. చిన్న వయసులో తను అనుభవించిన పేదరికం ఆమెని ఇంటి పనిమనిషిగా మార్చింది. తాగుడికి అలవాటు పడిన బాధ్యతలేని తండ్రి వల్ల అమ్మకు సాయంగా ఇల్లిళ్లు తిరిగి పనిచేసింది. ఇన్ని కష్టాలు అనుభవిస్తున్న వర్షకి డ్యాన్స్ చేయాలన్న కోరిక బలంగా ఉండేది. అయినా అది తన బాల్యం, యవ్వనంలో తీరే దారి కనిపించలేదు. భవిష్యత్తులో తీరుతుందన్న ఆశా లేదు. అయితే..

వర్ష మాత్రం తన కోరికని అలా వదల్లేదు. సోషల్‌మీడియాని వేదికగా చేసుకుంది. తనకి వచ్చిన స్టెప్పులతో డ్యాన్స్ చేసి అప్‌లోడ్ చేసింది. మొదట్లో ఎన్నో అవమానాలు వచ్చాయి. భరించింది. ట్రోల్ చేశారు. సహించింది. ఎప్పుడైతే తన స్టోరీని ఇన్‌స్టాలో పోస్టు చేసిందో అప్పుడే ఆమె స్ఫూర్తివంత ప్రయాణం జనాలకి తెలిసింది. పనిమనిషి నుండి ఆమె ఎదిగిన తీరుని వైరల్ చేశారు. ఓ డ్యాన్స్ షోలో ప్రదర్శన ఇచ్చేంతగా ఆ డ్యాన్స్ వీడియోలు వైరల్ అయ్యాయి.

బాలీవుడ్ దిగ్గజ నటుల సమక్షంలో 'డ్యాన్స్ దివానే' డ్యాన్స్ షోలో ఆమె చేసిన ప్రదర్శన చూసి జడ్జిలు అబ్బురపడ్డారు. ఆ తరువాత తన కథ తెలిసి గుండెలకి హత్తుకున్నారు. ఇది ఒక అమ్మ సాధించిన విజయం. పనిమనిషిగా మొదలైన వర్ష ప్రయాణం డ్యాన్సర్‌గా ఆమెని నిలబెట్టింది. 'ఇది జీవితం నాకిచ్చిన రెండో అవకాశం. ఈ స్థాయికి వస్తానని నేను కలగనలేదు. నేనెంతో ఇష్టపడ్డ డ్యాన్స్ నన్ను ఇంతమంది హృదయాలు గెలుచుకునేలా చేసింది' అని వర్ష ఒకింత భావోద్వేగంగా ఆ డ్యాన్స్ షోలో మాట్లాడిన మాటలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తాయి. 'నువ్వు నిజమైన హీరోవి. ప్రజలు నీ నుండి ఎంతో నేర్చుకోవాలి. ఎన్ని కష్టాలు వచ్చినా నువ్వు ధైర్యంగా నిలబడ్డావు' అని వర్షని ఉద్దేశించి జడ్జిలు చేసిన వ్యాఖ్యలు కూడా వాస్తవం. సున్నా నుండి ప్రారంభమైన వర్ష జీవితం ఇప్పుడు తనని ఓ స్టార్‌ని చేసింది. ఇన్‌స్టాలో 68 లక్షల ఫాలోవర్లతో ప్రముఖుల స్థానంలో నిలిచేలా చేసింది.

కార్మికులపై వివక్ష చూపొద్దు

టాలీవుడ్ సినీ కార్మికుల పోరుబాట 16వ రోజుకు చేరింది. మంగళవారం పరిశ్రమకు చెందిన పలు శాఖలతో కలిసి కృష్ణనగర్ యూనియన్ ఆఫీస్‌లో సమావేశం జరిగింది. మీటింగ్ ముగిశాక ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్ మీడియాతో మాట్లాడారు. 'సోమవారం చిరంజీవిగారితో మూడు గంటలపాటు చర్చలు జరిగాయి. మాకు న్యాయం చేస్తే సడలింపులకు ఓకే అని చెప్పాం. రెండు రోజుల్లో చిరంజీవి సమస్యను పరిష్కరిస్తామని మాటిచ్చారు. కార్మికులను చిన్నచూపు చూస్తే ఊరుకోం. మూడు నెలల నుంచి వేతనాలు పెంచాలని నోటీసులు ఇస్తున్నాం. ఎప్పటికప్పుడు అడుగుతూనే ఉన్నాం. జూన్‌లో ఛాంబర్ మాతో చర్చలు జరిపింది. కానీ నిర్మాతలు లేబర్ కమిషనర్ దగ్గరకు వెళ్లారు. మొదట 5 శాతం పెంచుతామన్నారు. అందుకు నాలుగు నిబంధనలు పెట్టారు. డ్యాన్సర్స్, ఫైటర్స్ రేషియో రద్దు చేయాలన్నారు. ఆదివారం డబుల్ పేమెంట్ ఇవ్వమన్నారు. 9 నుంచి 9 గంటల వరకు పని దినం అంటున్నారు. కార్మికులకు కడుపు కాలితే వాళ్లే పనిలోకి వస్తారని కించపరిచేలా కొందరు మాట్లాడుతున్నారు. అది కరెక్ట్ పద్ధతి కాదు."

సహకరిస్తామన్నా.. కనికరించడం లేదు

మేము కార్పొరేట్ ఉద్యోగులం కాదు. కష్ట జీవులం. 24 యూనియన్స్‌లో దినసరి వేతనం తీసుకునేది 13 యూనియన్లు. అందులో పది శాఖలకు పెంచుతామని మూడు యూనియన్‌లకు పెంచమని అంటున్నారు. మళ్లీ 30 శాతం పెంపు కుదరదంటున్నారు. మేం చిన్న సినిమాలకు పూర్తి సహకారం అందిస్తాం. నిర్మాతలకు అండగా ఉంటాం. చిన్న నిర్మాతలతో సమావేశమవుతాం. నిర్మాతలకు ఇబ్బందులు లేకుండా కార్మికులంతా సహకరిస్తామని మాటిచ్చాం. కానీ కనికరించడం లేదు. మూడు ఆదివారాలు సింగిల్ కాల్షీట్ అంటున్నారు. ఆదివారం ఇంట్లో పెళ్లాం పిల్లలను వదిలేసి వచ్చి కష్టపడతాం. అందుకే డబల్ కాల్షీట్ అడుగుతున్నాం. ఒక్క కాల్షీట్ 10 గంటలు ఉంటుంది. కానీ కార్మికులు 16 గంటలు కష్టపడుతున్నారు. అందుకే మేం కూడా న్యాయంగానే వేతనాల గురించి అడుగుతున్నాం' అని అనిల్ అన్నారు.

ఒక్క రోజు పని లేకపోయినా ...

దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ సమ్మె గురించి మాట్లాడారు. 'కార్మికుల వేతనాలు పెంచాలని అందరికీ తెలుసు. కానీ ఏదో ఒక వంకతో 16 రోజులుగా ఆలస్యం చేస్తున్నారు. ఒక్కరోజు పని లేకపోయినా బతకలేని వారు 50 శాతం మంది పరిశ్రమలో ఉన్నారు. వారి గురించి కాస్త అయినా ఆలోచించాలి కదా? ఇప్పుడున్న పరిస్థితుల్లో నెలకు పది రోజులు పని దొరకడం లేదు. సినీ కార్మికులకు సాఫ్ట్‌వేర్ కన్నా ఎక్కువ సంపాదన వస్తుందని కొందరు అంటున్నారు. నెలలో 30 రోజులూ పని ఉంటేనే అది సాధ్యం. నెలలో 30 రోజులు పని ఇస్తే జీతాలు పెంచాల్సిన అవసరం లేదు. 15 రోజులుగా షూటింగ్ పనులు ఆపడం అన్యాయం. ఈ పద్ధతి ఎక్కడా లేదు. నిర్మాతల గురించి కూడా సానుభూతిలో ఆలోచించాలి' అన్నారు.



నిజాలు చూపించే చిత్రం 'యూనివర్శిటీ



ఆర్. నారాయణ మూర్తి స్వీయ దర్శకత్వంలో నటించి, నిర్మించిన 'యూనివర్సిటీ : పేపర్ లీక్' చిత్రం ఆగస్ట్ 22న విడుదల కాబోతోంది. తాజాగా ఈ సినిమాని బ్రహ్మానందానికి చూపించారు. ఈ సందర్భంగా నారాయణ మూర్తి మాట్లాడుతూ, తెలుగు సినిమా రంగంలో అలనాటి ప్రముఖ హాస్యనటుల తర్వాత ఇప్పుడు బ్రహ్మానందం ఎరా నడుస్తుందని అన్నారు. సినిమా చూసిన తర్వాత బ్రహ్మానందం మాట్లాడుతూ, 'నారాయణమూర్తి తేనెటీగ లాంటి వాడు. తిరుగుతూ తిరుగుతూ ఉంటాడు. అన్ని చోట్ల తేనె పోగుచేసుకుని వచ్చి తలా ఒక చుక్క పంచిపెడుతుంటాడు. నా దృష్టిలో ఆయన అందమైన హీరో. ఒకసారి మదర్ థెరిస్సాను 'మీ దృష్టిలో అందమైన వ్యక్తి ఎవరు?' అని అడిగితే, 'ఎవరి మనసులో సేవాభావం ఉంటుందో, ఎవరి కళ్ళలో దయా గుణం ఉంటుందో ఆ జీవి అందంగా కనిపిస్తుంది' అని చెప్పారు. నలభై యేళ్ళుగా నారాయణమూర్తి నాకు తెలుసు. నిరంతరం ప్రజలు, అందునా పేద ప్రజల పక్షాన నిలిచే వ్యక్తి ఆయన. ఈ సినిమా చూసిన తర్వాత నేను ఎంతో ఎమోషన్ కు గురయ్యాను. ఇవాళ మన దేశంలో ఎడ్యుకేషన్ సిస్టమ్ ఎలా ఉందో ఎంతో స్టడీ చేసి నారాయణమూర్తి ఈ సినిమా తీశాడు. ఇది వాస్తవానికి దూరంగా ఉన్న సినిమా కాదు. ఇది ఊహించుకున్నటువంటి ఒక సుందరాంగి సినిమా కాదు. ఇందులో నిజాలుంటాయి, వెతుక్కోండి. ఇందులో బూతులు ఉండవు. జీవితపు లోతులు వుంటాయి, వెతుక్కోండి. కొన్ని డైలాగ్స్ అద్భుతంగా ఉన్నాయి. డబ్బు కోసం కాకుండా నిజాయితీగా తను అనుకున్న దాని చెప్పాలని తీసిన 'యూనివర్సిటీ' సినిమా చూడండి. పేపర్ లీకేజీ సమస్యను చాలా చక్కగా ఇందులో వివరించారు. ఇలాంటి వారు వ్యక్తులు కాదు శక్తులు. గోదావరి భాషలో చెప్పాలి అంటే పులస చేపలాంటి వాళ్ళు. పులస చేప నదికి ఎదురు ఈదుతుంది. నారాయణమూర్తి కూడా అంతే. ఇలాంటి అద్భుతమైన సినిమాలు నారాయణమూర్తి మరిన్ని తీసి ప్రజల ఆశీర్వాదాలతో చిరస్థాయిగా ఉండాలి అని కోరుకుంటున్నాను' అన్నారు.

షెఫాలీకి నిరాశ

రేణుక సింగ్ పునరాగమనం
వన్డే వరల్డ్‌కప్‌కు భారత మహిళల జట్టు

ముంబయి : ఐసీసీ మహిళల 2025 వన్డే వరల్డ్‌కప్ భారత జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. యువ ఓపెనర్, ధనాధన్ హిట్టర్ షెఫాలీ వర్మకు సెలక్షన్ కమిటీ మొండిచేయి అందించింది. డబ్ల్యూపీఎల్ 2025 సహా ఇటీవల భారత్-ఏ తరపున ఆసీస్‌లో నిలకడగా రాణించిన షెఫాలీ వర్మ సెలక్షన్ కమిటీ, జట్టు మేనేజ్‌మెంట్ నమ్మకాన్ని పొందలేకపోయింది. షెఫాలీ వర్మ లేని వేళ టీమ్ ఇండియాకు వన్డేలో రాణించిన యువ ఓపెనర్ ప్రతిక రావల్‌తోనే సెలక్షన్ కమిటీ ముందుకెళ్లింది. 15 మందితో కూడిన భారత జట్టును బీసీసీఐ ఆల్ ఇండియా మహిళల సీనియర్ సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్ స్మృతీ మంధాన, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియాలు చీఫ్ సెలక్టర్ నీతూ డెవిడ్ అధ్యక్షతన జరిగిన సెలక్షన్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ సెప్టెంబర్ 30 నుంచి భారత్ వేదికగా ఆరంభం కానున్న సంగతి తెలిసిందే.

ఆ ఇద్దరు ఇన్ :

ఫిట్‌నెస్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న పేసర్ రేణుక సింగ్ ఠాకూర్, ఆల్‌రౌండర్ అమన్జోత్ కౌర్‌కు భారత ప్రపంచకప్ జట్టులో చోటు లభించింది. యువ ఓపెనర్ షెఫాలీ వర్మ ఇటీవల ఫామ్ చాటుకున్నా.. ఆమెకు నిరాశ తప్పలేదు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్ స్మృతీ మంధానకు తోడు ప్రతిక రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రొడ్రిగస్ బ్యాటింగ్ లైనప్‌లో నిలిచారు. రిచా ఘోష్, యస్తికా భాటియాలు వికెట్ కీపర్లుగా ఎంపికయ్యారు. బౌలింగ్ విభాగంలో హైదరాబాదీ అరుంధతి రెడ్డి, రేణుక సింగ్ ఠాకూర్, క్రాంతి గౌడ్, రాధ యాదవ్, శ్రీ చరణి, స్నేహ్ రానాలు నిలిచారు.

ఆసీస్‌తో సిరీస్‌కు ఒక్క మార్పు : సెప్టెంబర్ 14-20న భారత్, ఆస్ట్రేలియా అమ్మాయిలు మూడు మ్యాచుల వన్డే సిరీస్ ఆడనున్నారు. తొలి రెండు వన్డేలు న్యూ చండీగఢ్ (ముల్లాన్‌పూర్)లో జరుగనుండగా.. ఆఖరు వన్డే న్యూఢిల్లీలో షెడ్యూల్ చేశారు. మహిళల ప్రపంచకప్ ముంగిట హర్మన్‌ప్రీత్ సేన ఈ సిరీస్‌ను సన్నాహకంగా భావిస్తోంది. ఆల్‌రౌండర్ అమన్జోత్ కౌర్ బెంగళూర్‌లోని సీఓఈలో ఫిట్‌నెస్ మెరుగుపర్చుకుంటోంది. దీంతో ఆసీస్‌తో సిరీస్‌లో అమన్జోత్ కౌర్ ఆడటం లేదు. ఆమె స్థానంలో సయాలి ఆసీస్‌తో సిరీస్‌లో ఆడనుంది. ప్రపంచకప్ వార్మప్ మ్యాచుల్లో అమన్జోత్ కౌర్ బరిలోకి దిగుతుంది.

ఐసీసీ వన్డే ప్రపంచకప్‌కు భారత మహిళల జట్టు

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతీ మంధాన (వైస్ కెప్టెన్), ప్రతిక రావల్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, జెమీమా రొడ్రిగస్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), రేణుక సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, అమన్జోత్ కౌర్, రాధ యాదవ్, యస్తికా భాటియా (వికెట్ కీపర్), శ్రీ చరణి, స్నేహ్ రానా.

స్టాండ్ బైలు : తేజల్, ప్రేమ రావత్, ప్రియ మిశ్రా, ఉమ ఛెత్రి, మిన్ను మణి, సయాలి.

శుభ్‌మన్‌కు చోటు

- శ్రేయస్, జైస్వాల్‌కు మొండిచేయి
- జశ్‌ప్రీత్ బుమ్రానే పేస్ దళపతి

ఆసియా కప్ భారత జట్టు ఎంపిక

ముంబయి : 2025 ఆసియా కప్‌కు భారత జట్టును ఎంపిక చేసిన బీసీసీఐ ఆల్ ఇండియా సీనియర్ సెలక్షన్ కమిటీ.. 2026 ఐసీసీ టీ20 ప్రణాళికలను సైతం ఆవిష్కరించింది. వచ్చే ఏడాది టైటిల్ డిఫెన్స్‌లో భాగంగా 16-17 మంది క్రికెటర్లతోనే పొట్టి ఫార్మాట్‌లో నిలకడగా ఆడాలనే ప్రణాళికతో ఉన్నామని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు. దీంతో టీ20 ఫార్మాట్‌లో గొప్పగా రాణిస్తున్న శ్రేయస్ అయ్యర్, యశస్వి జైస్వాల్‌కు ప్రపంచకప్ ప్రణాళికల్లోనూ చోటు లేదని తేలిపోయింది!. ఐపీఎల్ ఫామ్, టెస్టు కెప్టెన్సీ ప్రభావంతో శుభ్‌మన్ గిల్ అలవోకగా టీ20 జట్టులోకి వచ్చేశాడు. పొట్టి ఫార్మాట్‌లో చోటుతో పాటు వైస్ కెప్టెన్సీ సైతం శుభ్‌మన్ గిల్ దక్కించుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో 15 మందితో కూడిన భారత జట్టు ఆసియా కప్‌లో పోటీపడనుంది. భారత్ ఆతిథ్యం ఇస్తున్న 2025 ఆసియా కప్ పాకిస్తాన్‌తో ఒప్పందం కారణంగా తటస్థ వేదిక యుఏఈలో జరుగనుంది. సెప్టెంబర్ 9 నుంచి ఆరంభం కానున్న ఆసియా కప్‌లో భారత్ డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఆలస్యంగా ముంబయికి చేరుకోవటంతో సెలక్షన్ కమిటీ సమావేశం సైతం షెడ్యూల్ సమయానికంటే ఆలస్యంగా ఆరంభమైంది. వర్షం కారణంగా దేవజిత్ ప్రయాణిస్తున్న విమానాన్ని అహ్మదాబాద్‌కు మళ్లించారు. అహ్మదాబాద్ నుంచి మళ్లీ ముంబయి చేరుకునేందుకు ఆలస్యమైంది. మహిళల సెలక్షన్ కమిటీ సమావేశం సైతం ఆలస్యంగానే మొదలైంది.

ఆసియా కప్‌కు భారత జట్టు :

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), హార్దిక్ పాండ్య, అర్ష్‌దీప్ సింగ్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, శివం దూబె, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, జశ్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్, హర్షిత్ రానా, రింకూ సింగ్, సంజు శాంసన్.

స్టాండ్‌బై ఆటగాళ్లు : ప్రసిద్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్.

చాంపియన్ స్వైటెక్
ఫైనల్లో పావొలినిపై గెలుపు

- సినర్ వాకోవర్‌తో అల్కరాస్‌కు టైటిల్
- సిన్సినాటి ఓపెన్ టెన్నిస్ 2025

సిన్సినాటి (యుఎస్ఏ) : 2025లో పోలాండ్ భామ ఇగా స్వైటెక్ వరుస టైటిల్స్‌తో అదరగొడుతుంది. మట్టి కోర్టులో తిరుగులేని రికార్డులు కలిగిన ఇగా స్వైటెక్ ఈ ఏడాది పచ్చిక (వింబుల్డన్), హార్డ్ (సిన్సినాటి) కోర్టులో మెరుస్తోంది. సిన్సినాటి ఓపెన్‌లో సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో వరల్డ్ నం.9 జాస్మిన్ పావొలిని (ఇటలీ)పై 7-5, 6-4తో ఇగా స్వైటెక్ వరుస సెట్లలో ఘన విజయం సాధించింది. ఇగా స్వైటెక్ కెరీర్‌లో ఇది డబ్ల్యూటీఏ 1000 స్థాయి 11వ టైటిల్ విజయం కావటం విశేషం. సుమారు రెండు గంటల పాటు సాగిన టైటిల్ పోరులో ఇగా స్వైటెక్ 9 ఏస్‌లు, ఆరు బ్రేక్ పాయింట్లతో రాణించింది. జాస్మిన్ పావొలిని నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించింది. తొలి సెట్లో 5-5తో గట్టి పోటీనిచ్చిన పావొలిని.. రెండో సెట్లో ఆశించిన ప్రతిఘటన చేయలేదు. పాయింట్ల పరంగా 77-65తో స్వైటెక్ ఆధిపత్యం చూపించింది. స్వైటెక్ 13 గేములు గెలుపొందగా.. పావొలిని 9 గేములే నెగ్గింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68